ప్రాజెక్ట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతం



- టీబీపీ ఎల్లెల్సీ చైర్మన్ టిప్పుసుల్తాన్, జీడీపీ చైర్మన్ కేఈ మల్లికార్జునగౌడ్
- ఏకగ్రీవంగా ఎన్నుకున్న సభ్యులు
- రాత్రికి రాత్రే మారిన రాజకీయ సమీకరణాలు
- హొళగుంద డీసీ అధ్యక్షుడు శివప్రసాద్‌కు చేజారిన పీఠం
- ముగిసిన సాగునీటి ఎన్నికల ప్రక్రియ

తొమ్మిదేళ్ల తరువాత టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల ప్రక్రియ శనివారంతో ముగిసింది. మూడు దశల్లో చేపట్టిన ఎన్నికల్లో భాగంగా ఎంతో కీలకమైన ప్రాజెక్టు కమిటీ (పీసీ) ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. పీసీ చైర్మన్, వైస్ చైర్మన్ పీఠం దక్కించుకున్నవారు సంబరాల్లో మునిగితేలితే.. పదవి ఆశించి భంగపడిన నాయకులు ఎన్నిక ముగియగానే నిరుత్సాహంతో వెనుదిరిగారు. ఎల్లెల్సీ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ పదవి కోసం నలుగురు పోటీ పడడంతో నిర్ణయం అధిష్టానానికి వదిలేశారు. టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు, టీడీపీ యువనేత, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ ఆశీస్సులతో మంత్రాలయం నియోజకవర్గానికి చెందిన పి. టిప్పుసుల్తాన్ జిల్లాలోనే అతిపెద్ద టీబీపీ ఎల్లెల్సీ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ పీఠం దక్కించుకున్నారు. ఎమ్మెల్యేలు, జిల్లా ముఖ్య నాయకుల సహకారంతో గాజులదిన్నె ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా కోడుమూరుకు చెందిన కేఈ మల్లికార్జునగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కర్నూలు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ), గాజులదిన్నె ప్రాజెక్టు, హంద్రీనీవా కాలువ, టీబీపీ హెచ్చెల్సీ ఆలూరు బ్రాంచి కాలువ సహా చిన్ననీటి పారుదల చెరువుల నిర్వహణ, ఆయకట్టు రైతులకు సాగునీటి సేవలు అందించాలనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల నిర్వహణకు సై అంది. రాష్ట్రంలో సాగునీటి సంఘాల ఎన్నికలకు అక్టోబరు 9న రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. అదే నెల 21న కలెక్టరు పి. రంజిత్‌బాషా నోటిఫికేషన్ జారీ చేశారు. 41 రోజుల్లో మూడు దశల్లో డబ్ల్యూయూఏ, డీసీ, పీసీ ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. అయితే అసెంబ్లీ సమావేశాలు, ఆ తరువాత డిసెంబరు 5న నోటిఫికేషన్ జారీకి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో రెండోసారి కూడా వాయిదా పడ్డాయి. మూడో దఫా ఈ నెల 11న జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా జారీ చేశారు. 14న డబ్ల్యూయూఏ, 17న డిస్ట్రిబ్యూటరీ కమిటీ (డీసీ) ఎన్నికలు పూర్తి చేశారు. శనివారం కీలకమైన ప్రాజెక్ట్ కమిటీ (పీసీ) ఎన్నికలు ప్రశాంతంగా ముగియంతో మూడు దశల సాగునీటి ఎన్నికల ప్రక్రియకు తెరపడింది. జిల్లాలో ఎలాంటి సంఘటనలు జరగకుండా ఈ ఎన్నికలు ముగియడంతో జిల్లా యంత్రాంగం, ఇంజనీరింగ్ అధికారులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.


టీబీపీ ఎల్లెల్సీ పీసీగా ఎన్నికైన టిప్పు సుల్తాన్‌కు డిక్లరేషన్ అందజేస్తున్న ఎస్ఈ బాలచంద్రారెడ్డి, ఈఈ శైలేశ్వర్

ఏకగ్రీవంగా ప్రాజెక్ట్ కమిటీ ఎన్నికలు:

కర్నూలు నగరంలోని జల మండలి కేంద్రంగా జరిగిన తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ), గాజులదిన్నె ప్రాజెక్ట్ కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా ముగిశాయి. జల మండలి సమావేశ భవనంలో ఎన్నికల నోడల్ అధికారి, ఇరిగేషన్ కర్నూలు సర్కిల్ ఎస్ఈ బి. బాలచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఎల్లెల్సీ ప్రాజెక్ట్ కమిటీ(పీసీ) ఎన్నిక నిర్వహించారు. పీసీ పరిధిలో పది డీసీ అధ్యక్షులు సభ్యులుగా ఉన్నారు. పీసీ చైర్మన్ పదవి ఆశించి భంగపడిన హొళగుంద డీసీ-1 అధ్యక్షుడు మిక్కిలినేని వెంకట శివప్రసాద్ ఎన్నికకు గైర్హాజరయ్యారు. కౌతాళం డీసీ-2 అధ్యక్షుడు పి. టిప్పు సుల్తాన్, కోసిగి డీసీ-3 అధ్యక్షుడు జంపాపురం అనంతసేనారెడ్డి, పెద్దకడబూరు డీసీ-4 అధ్యక్షుడు నరవ రమాకాంతరెడ్డి, ఎమ్మిగనూరు డీసీ-6 అధ్యక్షుడు ఎన్. గోవర్ధన్‌రెడ్డి, గోనెగండ్ల డీసీ-7 అధ్యక్షుడు బావిగడ్డ హుశేన్‌సాబ్, కోడుమూరు డీసీ-8 అధ్యక్షుడు కురవ చంద్రశేఖర్ కర్నూలు డీసీ-9 అధ్యక్షుడు కె.మహేశ్వరరెడ్డి, కర్నూలు డీసీ-10 అవిజ ధర్మారెడ్డి హాజరు కాగా.. టీడీపీ అధిష్టానం పంపిన కౌతాళం డీసీ-3 అధ్యక్షుడు టిప్పుసుల్తాన్ నామినేషన్ వేశారు. అలాగే వైస్ చైర్మన్ పదవికి గోనేగండ్ల డీసీ-7 అధ్యక్షుడు బావిగడ్డ హుసేన్‌సాబ్ ఒక్కడే నామినేషన్ పత్రం ఇచ్చారు. మిగిలిన ఎనిమిది మంది సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించడంతో.. ఆథరైజ్డ్ అధికారి, ఎస్ఈ బాలచంద్రారెడ్డి ఏకగ్రీంగా ఎన్నికైనట్లు ప్రకటించి చైర్మన్, వైస్ చైర్మన్లు టిప్పుసుల్తాన్, బావిగడ్డ హుసేన్‌సాబ్‌లకు ధ్రువీకరణ పత్రం అందజేశారు.

గాజులదిన్నె ప్రాజెక్టు (జీడీపీ) పీసీ ఎన్నిక జలవనరుల శాఖ ఎస్ఈ ఛాంబర్‌లో ఆథరైజ్డ్ అధికారి, ఆదోని సబ్ కలెక్టరు ఎం.మౌర్యభరద్వాజ్ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ పీసీలో సభ్యులైన హెచ్.కైరవాడి, కోడుమూరు, ఒంటెడుదిన్నె, తిప్పనూరు, ఎ.లింగందిన్నె, కుర్నూరు, ముడుమలగుర్తి, పోతుగల్లు, మొన్నెంకుంట, గోరంట్ల, ఎర్రగుడి, తొగరచేడు డబ్ల్యూయూఏల అధ్యక్షులు రామాంజనేయులు, కేఈ మల్లికార్జునగౌడ్, బీటీ బడేసాబ్, బోయ కౌలుట్ల, కె.పెద్ద కృష్ణయ్య, అన్నం పురుసోత్తంరెడ్డి, ఇ.సోమలింగడు, కొడిదెల చిన్న మద్దయ్య, పి.రాధకృష్ణ, బి.మౌళాలి, బిఎన్ నడిపి భాస్కర్ హాజరయ్యారు. చైర్మన్ పీఠం కోసం కోడుమూరు డబ్ల్యూయూఏ-2 అధ్యక్షుడు కేఈ మల్లికార్జునగౌడ్, వైస్ చైర్మన్ పదవికి మన్నెంకుంట డబ్ల్యూయూఏ-9 అధ్యక్షుడు కొడిదెల చిన్న మద్దయ్యలు నామినేషన్ పత్రాలు అందజేశారు. మిగిలిన సభ్యులు ఆమోదం తెలపడం, పోటీ లేకపోవడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆదోని సబ్ కలెక్టర్ ఎం.మౌర్య భరద్వాజ్ ప్రకటించి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.


జీడీపీ పీసీగా ఎన్నికైన కేఈ మల్లికార్జున గౌడ్‌కు డిక్లరేషన్ అందజేస్తున్న ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

జల మండలిలో సంబరాలు

టీబీపీ ఎల్లెల్సీ పీసీ చైర్మన్, వైస్ చైర్మన్లు పి.టిప్పుసుల్తాన్, బావిగడ్డ హుసేన్‌సాబ్, జీడీపీ పీసీ చైర్మన్, వైస్ చైర్మన్లు కేఈ మల్లికార్జునగౌడ్, కొడిదెల చిన్నమద్దయ్యలను టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, మంత్రాలయం నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి ఎన్.రాఘవేంద్రరెడ్డి, తెలుగురైతు సంఘం రాష్ట్ర నాయకుడు సాయిబాబా తదితరులు అభినందించారు. పూలమాలలు వేసిన సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా తిక్కారెడ్డి, సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడారు. టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఎల్లెల్సీ జీడీపీ పీసీ చైర్మన్, వైస్ చైర్మన్లను ఏకగ్రీవంగా ఎన్నుకుందుకు సభ్యులకు అభినందనలు తెలియజేశారు. పదవులు చేపట్టిన నాయకులు కాలువల నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో పాటు చివరి ఆయకట్టుకు సాగునీరు ఇచ్చేందుకు కృషి చేయాలని కోరారు. అంతకుందు టీడీపీ జిల్లా కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలలు వేసి నివాళులర్పించారు.


కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులను అభినందిస్తున్న టీడీపీ నాయకులు

శివప్రసాద్‌కు చేజారిన చైర్మన్ పీఠం

ఎల్లెల్సీ పీసీ చైర్మన్ పీఠం కోసం ఆలూరు నియోజకవర్గానికి చెందిన హొళగుంద డీసీ-1 అధ్యక్షుడు మిక్కిలినేని వెంకట శివప్రసాద్, కౌతాళం డీసీ-2 అధ్యక్షుడు పి.టిప్పు సుల్తాన్, పెద్దకడబూరు డీసీ-4 అధ్యక్షుడు నరవ రమాకాంతరెడ్డి, ఎమ్మిగనూరు డీసీ-6 అధ్యక్షుడు ఎన్.గోవర్ధన్‌రెడ్డి పోటీ పడ్డారు. రెండు రోజుల క్రితం పీసీ చైర్మన్ అభ్యర్థి ఎంపికపై ఎమ్మెల్యేలు, ముఖ్యనాయకులు సమావేశమై శివప్రసాద్ పేరును ప్రతిపాదించారు. తెల్లారేసరికి అధిష్టానం నుంచి టి. టిప్పుసుల్తాన్ పేరు వచ్చింది.

పండ్ల తోటలకు ప్రభుత్వ రాయితీ

ఉద్యాన శాఖ జిల్లా అధికారి రామాంజనేయులు



కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పండ్ల తోటలను సాగు చేసే రైతులకు ప్రభుత్వం రాయితీలు అందిస్తోందని ఉద్యాన శాఖ జిల్లా అధికారి రామాంజనేయులు వెల్లడించారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రెండున్నర దశాబ్దాల కిందట టీడీపీ ప్రభుత్వ హయాంలో కరువు జిల్లాలో సాగునీటిని పొదుపు చేసేందుకు రైతులకు బింధు, తుంపర్ల పరికరాలను 90శాతం రాయితీతో అందించడం జరిగిందన్నారు. అదే విధంగా ప్రస్తుతం సీఎం చంద్రబాబు నాయుడు ప్రత్యేక చొరవ తీసుకుని పండ్ల తోటలను రైతులు ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసేందు కోసం ప్యాక్ హౌస్‌లు, శీతల గిడ్డంగులు, టమోటా సాస్, శీతల వాహనాలు, పండ్లతోటల నర్సరీలు వంటి వాటిని ఏర్పాటు చేసుకునేందుకు 30 నుంచి 50 శాతం సబ్సిడీని అందిస్తోందన్నారు. 30/20 అడుగుల ప్యాక్ హౌస్ ఏర్పాటుకు రూ.4లక్షలు ఖర్చు అవుతుందని అందులో ప్రభుత్వం రూ.2లక్షలు సబ్సిడీగా అందిస్తోందన్నారు. అదేవిధంగా 5వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న కోల్డ్ స్టోరేజీ ఏర్పాటుకు రూ.4లక్షలు ఖర్చు అవుతుండగా.. 1.40 లక్షలు ప్రభుత్వం సబ్సిడీగా ఇస్తుందన్నారు. సోలార్ కోల్డ్ రూం ఏర్పాటుకు 14 మెట్రిక్ టన్నులు రూ.12.50 లక్షలు ఖర్చు అవుతుండగా.. రూ.4.37 లక్షలు సబ్సిడీగా అందుతుందన్నారు. శీతల వాహనాలు 9 మెట్రిక్ టన్నుల కెపాసిటీ కాగా, రూ.26 లక్షలు ఖర్చు అవుతుండగా.. రూ.9.10 లక్షలు సబ్సిడీ ఇస్తోందన్నారు. కమ్యూనిటీ ఫారం ఫాండ్ ఏర్పాటుకు రూ.20 లక్షలు ఖర్చు కాగా రూ.100 శాతం సబ్సిడీని అందిస్తుందన్నారు. చిన్నతరహా పండ్ల మొక్కల నర్సరీలకు రూ.15 లక్షలు ఖర్చు కాగా.. రూ.7.50 లక్షలు ప్రభుత్వం సబ్సిడీగా అందుతుందని తెలిపారు.

ఇసుక టన్ను రూ.50కే..

- 172 చోట్ల వాగు, వంకలు గుర్తింపు - డీడీ
- రోజూ పదివేల టన్నుల ఇసుక తవ్వకాలు
- మైనింగ్ శాఖ డీడీ రవిచంద్ర



కర్నూలు అర్బన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా వ్యాప్తంగా రోజూ పదివేల టన్నుల ఇసుక తవ్వకాలు చేపడుతున్నట్లు మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రవిచంద్ర వెల్లడించారు. టన్ను ఇసుక రూ.50కే అందించే ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. శనివారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ జిల్లాలో 5 డిసిల్టేషన్, 4 ఇసుక రీచ్‌ల ద్వారా ప్రతి రోజు పదివేల టన్నులు తవ్వకాలు చేపడుతున్నామని తెలిపారు. కొత్తగా గుడికంబాలి, నదిచాగి, మరళీ-2ల్లోని 3 రీచ్‌ల్లో మిషనరీలతో ఇసుకను జేసీబీల ద్వారా తవ్వకాలకు టెండర్ల ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. ఈ ప్రక్రియ మంగళవారం నుంచి అందుబాటులోకి వస్తుందని తెలిపారు. టన్ను కేవలం రూ.50కే అందుబాటులోకి వస్తుందని తెలిపారు. గతంలో టన్ను రూ.202 ఉండేదని, ఇప్పటికే ఇసుక ధరలు తగ్గిపోవడంతో బుకింగ్ కూడా పడిపోయిందని తెలిపారు. ఇసుక రెండు రోజుల నుంచి లభ్యత లేదని, తవ్వకాలకు పర్యావరణ శాఖ అనుమతులు రాగానే ప్రక్రియను చేపడతామని తెలిపారు. జిల్లాలో 172 ప్రాంతాల్లో వాగులు, వంకలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో గృహఅవసరాల కోసం తరలించేందుకు ప్రత్యేక అనుమతులు జిల్లా యంత్రాంగం ఇచ్చిందని తెలిపారు.

సమగ్రశిక్ష ఏపీసీగా శ్రీనివాసులు

రాష్ట్ర ప్రభుత్వం ఉత్వర్వులు

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీగా టి.శ్రీనివాసులును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఈయన శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కావలిలో ఏపీఎంపీ విభాగంలో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. కర్నూలు ఏపీసీగా పని చేస్తున్న విజయ జ్యోతి కుమారి బదిలీ కావడంతో ఈ పోస్టు ఖాళీ ఏర్పడింది. గత కొన్ని నెలలుగా జిల్లా విద్యాశాఖ అధికారికి ఎఫ్ఏసీ బాధ్యతలను అప్పగించారు. నిజానికి నవంబరు 29న కర్నూలు ఏపీసీగా శ్రీనివాసులు నియమితులయ్యారు. అప్పట్లో అనివార్య కారణాల వల్ల ఈ ఉత్తర్వులను ప్రభుత్వం రద్దు చేసింది. తిరిగి శనివారం శ్రీనివాసులునే నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

సమష్టి కృషితోనే నగరాభివృద్ధి

- స్థాయి సంఘ సమావేశంలో మేయర్ బీవై రామయ్య

కర్నూలు న్యూసిటీ డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పాలకులు, అధికారులు సమష్టిగా కృషి చేస్తేనే నగరాభివృద్ధి సాధ్యమవుతుందని నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. శనివారం నగర పాలక కార్యాలయంలో స్థాయా సంఘ సమావేశం నిర్వహించారు. మొత్తం 8 తీర్మానాలను ప్రవేశ పెట్టారు. అందులో 6 తీర్మానాలు ఆమోదం పొందగా.. మరో రెండు తీర్మానాలు వాయిదా పడ్డాయి. 23, 24, 12, 2వ వార్డుల్లో మురుగు కాలువల నిర్మాణానికి రూ.1.47 కోట్లను కేటాయించారు. పలు ప్రాంతాల్లోని 3 పార్కింగ్ ప్రదేశాలను బహిరంగ వేలం పాట ద్వారా మూడేళ్లపాటు లీజుకు కేటాయించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. కాగా కొండారెడ్డి బురుజు సమీపంలో పూల మార్కెట్, నగర పాలక ఆదాయం పెంపులో భాగం 12 ఏళ్ల క్రితం పెట్టిన రుసుమును సవరిస్తూ మరికొన్ని దుకాణాలను కలిపి 346 రకాలుగా దుకాణాలను విభజించి వాటి రుసుం పెంపును సంబంధించిన తీర్మానాలు పునఃసమీక్షించాలని సభ్యులు నిర్ణయించారు. దీంతో ఆ రెండు తీర్మానాలు వాయిదా వేశారు. ఈ సమావేశంలో కమిషనర్ ఎస్. రవీంద్రబాబు, సభ్యులు ఎం. విక్రమసింహారెడ్డి, మిద్దె చిట్టమ్మ, యాసుఫ్, క్రాంతి కుమార్, జుబేర్, అదనపు కమిషనర్ ఆర్జీవీ క్రిష్ణ, మేనేజర్ చిన్న రాముడు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌గా మధుసూదన్‌రెడ్డి

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన సంస్థ (ఏపీఐఐసీ) జోనల్ మేనేజర్‌గా వై.మధుసూదన్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 17 మంది డిప్యూటీ కలెక్టర్లు బదిలీ అయ్యారు. గత కొంతకాలంగా వెయిటింగ్‌లో ఉన్న మధుసూదన్‌రెడ్డిని కర్నూలు జిల్లా ఏపీఐఐసీ జెడ్‌ఎంగా నియమించారు. ఇదిలా ఉండగా ఇటీవల చిత్తూరు జిల్లా నుంచి కర్నూలుకు బదిలీపై వచ్చి జోనల్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి తాజా పోస్టింగ్‌పై ఇంకా స్పష్టత రాలేదు.

మానసిక దివ్యాంగులకూ ప్రత్యేక చట్టాలు

హైకోర్టు జడ్జి జస్టిస్ కె. మన్మథరావు

కర్నూల లీగల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మానసిక దివ్యాంగుల సంక్షేమం కోసం పలు చట్టాలు ఉన్నాయని, వాటిని సరైన రీతిలో వినియోగించుకుని సత్వర న్యాయం పొందవచ్చని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మథ రావు తెలిపారు. కర్నూలు నగరంలోని అంబికా శిశు కేంద్రంలో శనివారం జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హైకోర్టు జడ్జి జస్టిస్ మన్మథరావు మాట్లాడుతూ మానసిక దివ్యాంగుల సంరక్షణ కోసం స్నేహపూర్వక న్యాయ సేవాల పథకం-2005లో పలు అవకాశాలు ఉన్నాయన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని ఉచిత న్యాయం పొందవచ్చని తెలిపారు. మానసిక దివ్యాంగులకు అంబికా శిశు కేంద్రంలో ట్రస్టు చేస్తున్న సేవా కార్యక్రమాలను ఆయన ప్రశంసించారు. ఆ తర్వాత మానసిక దివ్యాంగులు తయారు చేసిన బ్యాగులు, బుక్ బైండింగ్స్, టైలరింగ్, పెయింటింగ్ మొదలైన నైపుణ్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి, కర్నూలు అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి, కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ధి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి, అదనపు జిల్లా న్యాయాధికారులు జి.భూపాల్ రెడ్డి, పి.పాండురంగారెడ్డి, అంబికా శిశు కేంద్రం ట్రస్టీ దిలీప్ కుమార్, హేమ్‌చంద్, దేవ్‌చంద్ చారిటీ ట్రస్టీ శైలజారావు, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.


మానసిక దివ్యాంగుల నైపుణ్యాలను ప్రశంసిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి

పాల్ ల్యాబ్ టెక్నాలజీని బలోపేతం చేయండి

డీఈవో శామ్యూల్ పాల్

వెల్దుర్తి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్యను బలోపేతం చేయడానికి పర్సనలైజ్ అడాప్టివ్ ల్యాబ్ (పాల్ ల్యాబ్) ద్వారా అభ్యసన నైపుణ్యాలను మెరుగుపరచాలని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ అన్నారు. శనివారం వెల్దుర్తిలో జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో డీఈఓ శామ్యూల్ పాల్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్ ల్యాబ్ ద్వారా విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ల్యాబ్‌లోకి వెళ్లి పరిశీలించారు. గది శుభ్రంగా లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. ట్యాబ్ విద్యపై విద్యార్థులను అడగగా ఎవరూ చెప్పలేకపోయారు. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద వెల్దుర్తి బాలుర హైస్కూల్‌ను ఎంపికచేసి 30 ట్యాబ్‌లు అందజేశారన్నారు. ఇంకా జిల్లాలో 50 మంజూరుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందన్నారు. పాల్‌ట్యాబ్ సాంకేతిక విద్యను విద్యార్థులకు అందిండంలో రాష్ట్రంలో వెల్దుర్తి చివరి స్థానంలో ఉందన్నారు. ఉపాధ్యాయులకు క్రమశిక్షణ లేదని, పాఠశాల మెయింటనెన్స్ లేదని అన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. కట్టెల పొయ్యి మీద భోజనం వండకూడదని, గ్యాస్ పొయ్యి మీద చేయాలని భోజన నిర్వాహకులను ఆదేశించారు.


ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డీఈవో

సంక్రాంతికి గుంతలు లేని రహదారులు

- 31 లోపు పూర్తి చేయడమే లక్ష్యం
- ఆర్అండ్‌బీ ఎస్ఈ

కర్నూలు అర్బన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ నాటికి గుంతలు లేని రహదారులే లక్ష్యంగా ప్రభుత్వం వేగవంతంగా వ్యవహరిస్తోంది. ఈ క్రమంలో రోడ్ల మరమ్మతుల పనుల్లో స్పీడ్ పెంచింది. సొంత జిల్లాపై రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మంత్రి సైతం ప్రత్యేక దృష్టి సారించారు. ఆ మేరకు అధికారులు రహదారి పనులను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. జిల్లాలోని పలు రహదారులపై గుంతలు పూడ్చే దిశగా కాంట్రాక్టరను అధికారులు పరుగులు పెట్టిస్తున్నారు. ఈనెల 31లోపు గుంతలన్నింటినీ పూడ్చేందుకు ఒక ప్రణాళికను పెట్టుకుంది. పనులు దక్కించుకున్న ఓ కాంట్రాక్టర్‌కు గడువులోపు పూర్తి చేయకపోతే చర్యలు తప్పవంటూ హెచ్చరించడం ప్రస్తుతం ఆర్అండ్‌బీలో చర్చనీయాంశమైంది. ప్రతి కాంట్రాక్టర్ న్యాణ్యతతో కూడిన పనులు చేపడుతున్నారా..? లేదా అంటూ.. పర్యవేక్షణకు ఓ బృందాన్ని ఏర్పాటు చేసి పనులు నాణ్యతపై ప్రత్యేక నిఘా చేపట్టింది. పలు చోట్ల ఫిర్యాదులు రావడంతో వెంటనే స్పందించి కాంట్రాక్టర్లపై చర్యలు సైతం చేపట్టింది. పలువురు కాంట్రాక్టర్లు కూటమి ప్రభుత్వంలో పాత పనులకు సంబందించిన పెండింగ్ బిల్లులకు ఆమోదం తెలిపే ప్రక్రియ మొదలు కావడంతో పనులు చేసేందుకు ముందుకు రావడంతో పనుల పురోగతి సైతం వేగవంతమైంది. ఈ క్రమంలో కర్నూలు, నంద్యాల, ఆదోని డివిజన్ల పరిధిలో 429.95 కిలోమీటర్ల పనుల మరమ్మతులకు రూ.31.50 కోట్లను కేటాయించింది. కర్నూలు డివిజన్‌లో 204 కిలోమీటర్లకుగాను 127 కి.మీ పనులు పూర్తి చేశారు. ఆదోని డివిజన్‌లో 617 కిలోమీటర్లకు 211, నంద్యాల డివిజన్‌లో 429 కి.మీలకు 395 కి.మీ., పూర్తి చేశారు. మిగిలిన పనులను ఈనెలాఖరులోపు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇదే క్రమంలో ఆదోని డివిజన్‌లో 63 కిలోమీటర్లకు సంబంధించి లద్దగిరి, కోసిగి, హొళగుంద, పెద్దకడుబూరు మండలాల్లో సింగల్ రోడ్డును రూ.136 కోట్లతో డబుల్ రోడ్డుగా పూర్తి చేసేందుకు పనులను వేగవంతం చేసింది.

వేగవంతంగా పనులు



సంక్రాంతి నాటికి ప్రతి పల్లెకు ప్రజలు గుంతలు లేని రహదారులపై నడిపించడమే లక్ష్యంగా పనులను వేగవంతం చేస్తున్నాం. ప్రతి కాంట్రాక్టర్‌పై నిరంతరం ఒత్తిడి తీసుకొస్తున్నాం. పనులు సక్రమంగా చేయకపోతే వారి సమస్యలు తెలుసుకుని మరొకరికి పనులు అప్పగించే ప్రక్రియను చేపట్టి గడువులోపు పూర్తిచేస్తాం. పనుల పురోగతిపై మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి ప్రతి వారం సమీక్షిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రహదారులపై గుంతలు పూడ్చే ప్రక్రియను చేపడుతున్నాం.

- పి.మహేశ్వర రెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్ఈ



నాన్నే నాకు మార్గదర్శి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

గొప్ప విజయాలు సాధించాలని నూరి పోసేవారు

నంద్యాల కలెక్టర్ రాజకుమారి గణియ



నంద్యాల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం కొల్లివలస అనే మారుమూల గ్రామం మాది. ఆంధ్ర, ఒడిస్సా సరిహద్దులో కొండ ప్రాంతంలో ఉన్న ఊరు అది. 35 గడపలు ఉన్న చిన్న గ్రామం. మా నాన్న మాధవరావు, అమ్మ దమయంతి. మాది వ్యవసాయ కుటుంబం. అన్న రాజేంద్రకుమార్, నేను సంతానం. కుటుంబంలో పిల్లలు మాత్రమే ఉంటారని, అందులో ఆడ, మగ అనే బేధం ఉండకూడదన్నది నాన్న వాదన. అందుకే అన్నయ్యను, నన్ను ఒకేలాగా పెంచారు. ఓ రకంగా చెప్పాలంటే నన్నే కాస్త గారాబంగా పెంచారు. కానీ చదువు విషయంలో ఎలాంటి అశ్రద్ధ చేయనిచ్చేవారు కాదు. ఉద్యోగం చేసే ఆలోచన ఉన్నా లేకపోయినా, ఆడపిల్ల ఉన్నతంగా చదువుకోవాలని చెప్పేవారు. సినిమాల్లో ఏదైనా ప్రభుత్వ ఉద్యోగికి సంబంధించిన సంఘటన వస్తే 'అదిగో.. అలా నువ్వు కూడా గొప్ప అధికారివి కావాలి' అని చెప్పేవారు. అలా నాలో చిన్నప్పటి నుంచి గొప్పగా చదువుకోవాలని, ఉన్నత స్థాయి ఉద్యోగం సాధించాలనే ఆలోచనను నాటారు. నాన్న వెనుక ఉండి నడిపించబట్టే నేను ఈ రోజు ఓ జిల్లాకు ఉన్నతాధికారిగా నిలవగలిగాను.

ఆ సంఘటనే ఉన్నతాశయానికి పునాది..

చిన్నప్పటి నుంచి గొప్పగా చదువుకోవాలని, పీహెచ్‌డీ చేసి డాక్టరేట్ సంపాదించాలని ఆలోచన ఉండేది. కానీ ఎలాంటి ఉద్యోగ జీవితంలో కుదురుకోవాలి, అందుకు ఏం చేయాలి అనే ఆలోచన ఉండేది కాదు. 10వ తరగతి 534 మార్కులతో రాష్ట్ర స్థాయి 12వ ర్యాంకు సాధించినందుకు ఆగస్టు 15 సందర్భంగా అప్పటి శ్రీకాకుళం కలెక్టర్ చేతులు మీదుగా బహుమతి అందుకున్నాను. ఆ రోజు వేడుకల్లో కలెక్టర్ పొందుతున్న గౌరవం, ఓ ఉన్నత స్థానంలో ఉండి నా లాంటి వారికి ప్రోత్సాహం అందించడం వంటివి చూసి నాలో స్ఫూర్తి కలిగింది. నేను కూడా కలెక్టర్ స్థాయి అధికారిగా ఎదగాలని ఆ రోజు నిశ్చయించుకున్నాను. 10వ తరగతి తర్వాత చాలా మంది ఆలోచనలు పక్కదారి పడుతుంటాయని చెబుతుంటారు. కానీ నా విషయంలో అలాంటివి ఏమీ జరగలేదు. భవిష్యత్తు గురించి స్పష్టమైన ప్రణాళికలు ఉండటంతో చదువుకు సంబంధించినవి కాకుండా మరో ఆలోచన వచ్చేది కాదు. అందువల్లే ఇంటర్‌మీడియట్, డిగ్రీ, పీజీలో డిస్టింక్షన్‌లో పాసయ్యాను. 'ఈ రోజు చేసే పని నీ భవిష్యత్తును నిర్ణయిస్తుంది' అని పెద్దలు అందుకే చెప్పారు కాబోలు.

నాన్న ఒప్పందం ప్రకారమే పెళ్లి

మాది పెద్దలు కుదిర్చిన వివాహం. మా వారి పేరు శ్రీహరి. వృత్తిరీత్యా ఉపాధ్యాయు డు. నా పీజీ పూర్తి కాగానే నా పెళ్లి నిశ్చయించారు. 2003లో వివాహమైంది. మా అత్తగారిది చదువుకున్న కుటుంబమే కావటంతో భవిష్యత్తులో చదువుకునేందుకు ఎలాంటి ఇబ్బంది ఉండదని భావించారు. అయినా ముందు చూపుతో.. 'నా బిడ్డ చదువుకుంటా, ఉద్యోగం చేస్తా అంటే అడ్డు చెప్పకూడదు' అంటూ పెళ్లికి ముందే మా అత్తగారి కుటుంబం నుంచి మా నాన్న మాట తీసుకున్నారు. మాకు ఒక కొడుకు శ్రీదీప్. పెళ్లి అయిన ఏడాదే గ్రూప్-1 నోటిఫికేషన్ రావటంతో పరీక్షలు రాశాను. ఇక ఆ తర్వాత పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే విషయంలో మా వారు చాలా సాయపడ్డారు. తాను ఉపాధ్యాయుడు కావటంతో పరీక్షలకు సంబంధించిన విషయాలను గూర్చి చర్చించటం, నోట్సు తయారు చేయటం, ఎలా రాయాలి అనే విషయంలో చాలా బాగా తోడ్పాటును అందించారు. పెళ్లికి ముందు నాన్న ఎంతలా తోడ్పాటు అందించారో, పెళ్లి తర్వాత మా వారు కూడా అదే స్థాయిలో సహకారం అందించారు.

హెచ్‌సీయూలో పోస్ట్ గ్రాడ్యుయేషన్

చిన్నప్పటి నుంచి బాగా చదువులో ముందుండేదాన్ని. అన్నింటా ఫస్టు మార్కులు నాకే. 7వ తరగతి వరకు టెక్కలి జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకున్నాను. ఆ తర్వాత 10వ తరగతి వరకు వమ్మరవల్లిలో చదువుకున్నాను. ఇంటర్‌మీడియట్ విజయనగరం జిల్లాలోని తాటిపూడిలో ఏపీఆర్ జూనియర్ కళాశాలలో బైపీసీ చదివాను. ఆ తర్వాత బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ సబ్జెక్టులతో విశాఖపట్టణంలోని భారతీయ విద్యా కేంద్రంలో డిగ్రీ యూనివర్సిటీ టాపర్‌గా నిలిచాను. ఒక్కో సబ్జెక్టు పోస్ట్ గ్రాడ్యుయేషన్‌కు సంబంధించి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి ఓ ప్రత్యేకత ఉంది. ఒక్కో సబ్జెక్టుకు సంబంధించి పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేయడానికి 12 మందికి మాత్రమే అవకాశం ఉంటుంది. అలాంటి యూనివర్సిటీలో ఆలిండియా స్థాయి ఎంట్రన్స్ పరీక్షలో 8వ ర్యాంకు సాధించి సీటు సంపాదించాను. యానిమల్ బయో టెక్నాలజీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ (ఎమ్మెస్సీ) పూర్తి చేశాను. ఆ తర్వాత గేట్‌లో 94.34 పర్సంటేజీతో సీఐఎస్‌ఆర్ ఫెలోషిప్ సాధించాను. ఇలా చదువుకు సంబంధించిన ప్రతి మజిలీలో ప్రతిభ గల విద్యార్థిగా నిరూపించుకున్నాను. ఇన్ని మార్కులు తెచ్చుకోవాలని నాపై ఎవరూ ఒత్తిడి పెట్టేవారు కాదు. అయినా ఏదైనా సబ్జెక్టులో ఒక్క మార్కు తక్కువ వచ్చినా ఏడ్చేదాన్ని. కానీ ప్రస్తుతం పిల్లలు చదువు పేరిట తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. పిల్లలకు సబ్జెక్టులపైన ఇష్టం ఏర్పడేలా విద్యాబోధన చేయగలిగితే వారిపైన ఒత్తిడి ఉండదు. అధికారిగా ఆయా ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేసినప్పుడు ఉపాధ్యాయులకు అదే చెబుతుంటాను.



తల్లిదండ్రులు, సోదరుడితో కలెక్టర్ (ఫైల్)

సాహిత్యంపై ఆసక్తి ఎక్కువే..

చిన్నప్పటి నుంచి ప్రతిదీ చదివే అలవాటు ఉంది. అదే ఆసక్తి పుస్తకాల వైపు కూడా మళ్లింది. విధుల్లో తీరిక లేకుండా ఉండేంత పని ఉన్నా పుస్తకాలు చదివే అలవాటును వదులుకోలేదు. ఖాళీ దొరికితే చాలు పుస్తకం చదువుతాను. నీతిని బోధించే చిన్న చిన్న కథలను అసలు వదిలిపెట్టను. గురజాడ అప్పారావు శత జయంతి ఉత్సవాలు సందర్భంగా అదే పేరుతో వెలువడిన పుస్తకానికి, ఉత్తరాంధ్ర కవులు రాసిన 'సారస్వత నీరాజనం' పుస్తకానికి ముందుమాట కూడా రాశాను. పుస్తకాలు మనలోని మంచి చెడులను విశ్లేషించుకునేలా చేస్తాయి. చాలా వ్యసనాలు మనిషిని పతనం వైపునకు నడిపిస్తాయి, కానీ పుస్తకం చదవటం అనే వ్యసనం మాత్రం మనిషిని ఉన్నత మార్గాల వైపునకు తీసుకెళుతుంది.

నా వంతుగా పని చేయడమే..

'మన చదువు, హోదా మన చుట్టూ ఉన్న పరిస్థితులను మార్చగలగాలి' అనేది నా ఉద్దేశం. ఉద్యోగ జీవితం మొదలుపెట్టినప్పటి నుంచి అధికారిగానే కాకుండా సగటు మనిషిలా ఆలోచిస్తూ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేసేదాన్ని. కొన్ని విషయాలు ప్రభుత్వ అధికారిగా కాకుండా, సాధారణ వ్యక్తిలా ఆలోచించి సమస్యను పరిష్కరించేదాన్ని. అలా విజయనగరం జిల్లాలోని ఓ మారుమూల గ్రామాన్ని దత్తత తీసుకుని వంద శాతం మరుగుదొడ్లు నిర్మించి జాతీయ స్థాయి పురస్కారం అందుకున్నాను. ఈ విషయంపై నరేంద్ర మోదీ తన 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు.

గ్రూప్-1 అధికారి నుంచి కలెక్టర్ వరకు..

2009లో డిప్యూటీ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి ఎనిమిదేళ్లు ముగిసిన తర్వాత 2016లో ఐఏఎస్ బ్యాచ్‌కు ఎంపికయ్యాను. ఆ తర్వాత ముస్సోరిలోని లాల్ బహదూర్ శాస్త్రి అకాడమీలో శిక్షణ పొందాను. 2021లో ఐఏఎస్‌గా పదోన్నతి పొందాను. ఐఏఎస్‌గా మొదటి పోస్టింగ్ గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టాను. ఆ తర్వాత పదోన్నతిలో భాగంగా ఈ సంవత్సరం జూలై 7న నంద్యాల కలెక్టర్‌గా వచ్చాను. నన్ను కలెక్టర్‌గా చూడాలని కోరుకున్న మా నాన్న, నేను ఐఏఎస్‌గా పదోన్నతి పొందిన కొద్ది రోజులకే (2021లో) చనిపోయారు. ఇక అమ్మ 2012లో ఓ ప్రమాదంలో చనిపోయారు. నన్ను తీర్చిదిద్దిన నా తల్లిదండ్రులు నన్ను కలెక్టర్‌గా చూడలేదన్న బాధ మాత్రం మదిలో మెదులుతూనే ఉంటుంది.



భర్త, కుమారుడితో కలెక్టర్ రాజకుమారి గణియ

ఇప్పటికీ వారి ఆశీర్వాదం తీసుకుంటూ ఉంటా..

నాలో ప్రతిభ దాగి ఉందని గుర్తించింది బాలరాజు మాస్టరు, అన్నపూర్ణ టీచరు. వీరిద్దరు చిన్నప్పటి నుంచి నన్ను బాగా ప్రోత్సహించేవాళ్లు. 6వ తరగతి చదువుతున్నపుడు అన్నపూర్ణ టీచరు వల్లే వమ్మరవల్లి గురుకుల పాఠశాలలో సీటు సంపాదించాను. జిల్లాలోని మొదటి 30 మంది ప్రతిభ గలిగిన విద్యార్థులకు మాత్రమే గురుకుల పాఠశాలలో చేరేందుకు అవకాశం ఉంటుందని, బాగా చదువుతాను కాబట్టి నన్ను కూడా రాయమని సూచించారు. ఆమె ప్రోత్సాహంతో పరీక్ష రాసి వమ్మరవల్లి గురుకుల పాఠశాలలో సీటు సంపాదించి 10వ తరగతి వరకు అక్కడే చదివాను. తమ విద్యార్థి ఈ స్థాయికి ఎదిగిందని అందరికీ గర్వంగా చెప్పుకుంటారు. ఉపాధ్యాయ దినోత్సవం రోజున ఇప్పటికీ వారి ఆశీర్వాదం తీసుకుంటాను.

మొదటి ప్రయత్నంలోనే..

పెళ్లి అయినే ఏడాది అంటే 2003లో మొదటి సారి గ్రూప్ -1 పరీక్ష రాశాను. అప్పట్లో గ్రూప్- 1లో ఆప్షనల్ సబ్జెక్టులు ఉండేవి. నాది సైన్స్ గ్రూపు కాబట్టి బోటనీ, జువాలజీ సబ్జెక్టులను ఎంచుకుని పరీక్ష రాశాను. దీనికి సంబంధించిన ఫలితాలు వెంటనే రాలేదు. ఇదిలా ఉండగా 2007లో మళ్లీ గ్రూప్- 1 నోటిఫికేషన్ విడుదలైంది. ఈ పరీక్ష రాసిన కొన్నాళ్లకే 2003కి సంబంధించిన గ్రూప్- 1 ఫలితాలు విడుదలయ్యాయి. ఇందులో నేను గ్రూప్- 1 అధికారిగా ఎంపికయ్యాను. అలా మొదటి ప్రయత్నంలోనే విజయం సాధించి విజయనగరం జిల్లాలో డిప్యూటీ రిజిస్ట్రార్‌గా ట్రైనింగ్ పూర్తి చేసుకొని అదే జిల్లాలో మొదటి పోస్టింగ్ చేపట్టాను. ఇక 2007లో రాసిన గ్రూప్-1 పరీక్షకు సంబంధించిన ఫలితాలు 2009లో వచ్చాయి. రెండోసారి కూడా గ్రూప్-1 సాధించాను. ఆ తర్వాత విజయనగరం జిల్లాలో ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టాను. ఆ తర్వాత అదే జిల్లాలో జడ్పీ సీఈఓగా విధులు నిర్వర్తించాను. ఆ తర్వాత 2017లో తూర్పు గోదావరి జిల్లాకు బదిలీ అయ్యాను. ఆ జిల్లాలో డ్వామా పీడీగా, కాకినాడ ఆర్డీవోగా, జాయింట్ కలెక్టర్ -2 గా, ఇలా 2021 వరకు ఆ జిల్లాలోనే వివిధ హోదాల్లో పని చేశాను.

24 నుంచి క్రీడా పోటీలు



కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పండుగ సందర్భంగా ఈ నెల 24, 26 తేదీల్లో జూపాడుబంగ్లా మండలం బాస్కరాపురంలో అంతర్రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎబీఎం సంఘం పెద్దలు శనివారం తెలిపారు. విజేతలకు వరుసగా రూ.50వేలు, రూ.35వేలు, రూ.25వేలు, రూ.15వేలు నగదు బహుమతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 9701030603, 9642403482, 7989841124 నెంబర్లను సంప్రదించాలన్నారు.

25న ఓపెన్ వాలీబాల్ టోర్నమెంటు: క్రిస్మస్ సందర్భంగా ఎంఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామంలో ఈ నెల 25న ఓపెన్ టూ ఆల్ వాలీబాల్ టోర్నమెంటు నిర్వహిస్తున్నట్లు ఎంఎస్‌ఎఫ్ కమిటీ గ్రామ పెద్దలు తెలిపారు. విజేతలకు రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు, వరుస బహుమతులు కల్పిస్తున్నట్లు వారు తెలిపారు. ప్రవేశ రుసుం రూ.400లు చెల్లించాలన్నారు. వివరాలకు 7330868976 నెంబర్లను సంప్రదించాలన్నారు.

24న కబడ్డీ పోటీలు: క్రిస్మస్ సందర్భంగా దామగట్ల గ్రామంలో ఈ నెల 24, 25 తేదీల్లో క్రిస్మస్ ఉమ్మడి జిల్లాల కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ సుశీలమ్మ తెలిపారు. విజేతలకు వరుసగా రూ.20వేలు, రూ.15వేలు, రూ.8వేలు, రూ.5వేలు నగదు బహుమతులు కల్పిస్తున్నట్లు తెలిపారు.

26న సైకిల్ రేస్: ఈ నెల 26న దామగట్లలో సైకిల్ రేస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు విజేతలకు రూ.1,500లు ప్రథమ, రూ.800లు ద్వితీయ బహుమతులు కల్పిస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు.

కేడీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి పదవి కాలం

ఆరు నెలల పొడిగింపు

- జిల్లా సహకార సంఘాలు కూడా
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

కర్నూలు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (కేడీసీసీబీ) పర్సన్ ఇన్‌చార్జి జిల్లా జాయింట్ కలెక్టర్ (జేసీ) నవ్యను ప్రభుత్వం నియమించిన సంగతి తెలిసిందే. పర్సన్ ఇన్‌చార్జి పదవి కాలం ఈ నెల 26వ తేదీతో ముగుస్తుంది. దీంతో 27వ తేదీ నుంచి మరో ఆరు నెలల పదవి కాలాన్ని పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే వ్యవసాయం అండ్ సహకార శాఖకు చెందిన జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీలకు ప్రస్తుతం కొనసాగుతున్న అధికారిక పర్సన్స్ ఇన్‌చార్జి పదవీ కాలం మరో ఆరు నెలలు అంటే 27-12-2024 నుండి 26-06-2025 వరకు పొడిగిస్తూ ఆంధ్రప్రదేశ్ సహకార సంఘాల చట్టం-1964 మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం



అతిథులతో సామూహిక గీతా పారాయణం చేసిన చిన్నారులు

కర్నూలు కల్చరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీ వేంకటేశ్వర సంగీత, నృత్య కళానిలయం నిర్వాహకురాలు బి. నాగమల్లేశ్వరమ్మ శిష్య బృందం నిర్వహించిన సామూహిక గీతా పారాయణం కార్యక్రమానికి వండల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం లభించింది. శనివారం నగరంలోని సంకల్‌బాగ్‌లోని గీతా ప్రచార ధామం ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో 155 మంది చిన్నారులు భగవద్గీతలోని 47 శ్లోకాలు సామూహికంగా పారాయణం చేసి ఒక రికార్డును నెలకొల్పారు. ఈ కార్యక్రమానికి చిన్నారులకు శిక్షణ ఇచ్చిన బి. నాగమల్లేశ్వరమ్మకు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్సు నిర్వాహకులు మెడల్‌తోపాటూ ధ్రువీకరణ పత్రం అందజేసి సత్కరించారు.



మెడల్, ధ్రువీకరణ పత్రంతో నాగమల్లేశ్వరమ్మ

రాష్ట్ర స్థాయి వక్తృత్వ పోటీలకు ఎంపిక

పాణ్యం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల 9వ తరగతి బాలిక చైతన్య సాయిశ్రీ రాష్ట్ర స్థాయి వక్తృత్వ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం మేరీ సునీత తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ 'కంజూమర్స్ అఫైర్' అనే అంశంపై నంద్యాలలో శనివారం జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో బాలిక ప్రతిభ చూపిందని తెలిపారు. ఈనెల 24 న విజయవాడలో రాష్ట్ర వినియోగదారుల సంక్షేమ సంఘం ఆద్వర్యంలో నిర్వహించే వక్తృత్వ పోటీలలో బాలిక పాల్గొంటుందని తెలిపారు. వ్యాసరచన పోటీల్లో పాఠశాలకు చెందిన జ్యోత్స్న ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు. బాలికలను పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యారు అభినందించారు.



చైతన్య సాయిశ్రీ

తుంగభద్ర తీరం..

సాహిత్యం







ఒకే ఇతివృత్తం... రెండు పుస్తకాలు

కర్నూలు జిల్లా రచయితల వినూత్న ప్రయోగం

కర్నూలు కల్చరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఇతివృత్తం ఒకటే...కానీ రాసిన పుస్తకాలు మాత్రం రెండు. ఒకటి రేడియో నాటకంగా జాతీయ స్థాయిలో బహుమతులు సాధిస్తే, మరోటి పౌరాణిక పద్య నాటకంగా ఆదివారం ఆవిష్కరణకు సిద్ధమైంది. ఇది కర్నూలుకు చెందిన రచయిత వినూత్న ప్రయోగంగానూ కళ, సాహిత్య చరిత్రలో కొత్త అధ్యాయాన్ని సృష్టిస్తోంది. కర్నూలుకు చెందిన ప్రముఖ నవలా రచయిత ఎస్‌డీవీ అజీజ్ 'సామా' అనే రేడియో నాటకాన్ని రాశారు. ఇది 1995-96 సంవత్సరంలో ఆకాశవాణి హైదరాబాదు కేంద్రంలో ధారావాహిక నాటకంగా ప్రసారమైంది. అంతేకాదు జాతీయ స్థాయిలోనూ బహుమతి పొంది, అన్ని భారతీయ భాషల్లోకి అనువాదమై దేశవ్యాప్తంగా రేడియోలో శ్రోతలను అలరించింది. అయితే ఇదే నాటకంలో పాత్రలు పెంచి, 'జగదేక సుందరి సామా' పేరుతో రెండున్నర గంటల రంగస్థల నాటకంగా టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు, విద్వాన్ పత్తి ఓబులయ్య రూపొందించారు. ప్రముఖ నాటక రచయిత, దివంగత పల్లేటి కులశేఖర్ సంభాషణలు సమకూర్చగా, నాటకంలో పద్యాలు పత్తి ఓబులయ్య రచించారు. ఒక రాజ్యంలో రాజనర్తకిగా ఖ్యాతి గాంచిన వేశ్య సామా. ఆమె ఒక బానిసను ప్రేమిస్తుంది. దానికి బదులుగా ఆమెకు ఉన్న హక్కు ప్రకారం రాజ్యంలోని బానిసలను విడిపించాలని షరతు పెడతాడు ఆ ప్రేమికుడు. బదులుగా ఆమె బానిసత్వానికి విముక్తి కల్పించడం, కానీ ఆ ప్రేమికుడు ఆమె ప్రేమకు తగను అంటూ విషం సేవించి మరణించడం, ఆమె వాస్తవ స్థితిలోకి వచ్చి బౌద్ధ సన్యాసిగా మారిపోవడం ప్రధాన ఇతివృత్తం. అటు రేడియో శ్రోతలను అలరించిన ఈ నాటకం, ఆదివారం సాయంత్రం 6:30 గంటలకు కర్నూలులోని టీజీవీ కళాక్షేత్రంలో రంగస్థల పుస్తకంగా ఆవిష్కరణ పొంది, నాటక ప్రదర్శనగా ఇటు ప్రేక్షకులను అకట్టుకోనుంది.



నగరంలో నేడు

- ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా నగర శివారులోని మామిదాలపాడులో వెలసిన గోదా గోకుల క్షేత్రంలో ఆదివారం ఉదయం 11:30 గంటలకు ఏడు రోజుల పాటు అఖండ విష్ణు సహస్రనామ పారాయణం ప్రారంభం అవుతుంది.
- ఏపీ నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ ఆదివారం కర్నూలుకు వస్తున్నారు.
- నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం మధ్యాహ్నం 3:30 గంటలకు ఉమ్మడి కర్నూలు జిల్లా రంగస్థల కళాకారుల సదస్సు.
- సాయంత్రం 6:30 గంటలకు జగదేక సుందరి సామా పుస్తకావిష్కరణ. అనంతరం పూర్తి నాటక ప్రదర్శన ఉంటుంది.



కవితలకు ఆహ్వానం

'యువకలం' శీర్షికకు యువకవుల నుంచి 15 లైన్లకు మించకుండా కవితలను ఆహ్వానిస్తున్నాం. కవితలను పంపవలసిన చిరునామా... **'యువకలం' శీర్షిక, ఆంధ్రజ్యోతి (దినపత్రిక), ఇండస్ స్కూల్ పక్కన, గుత్తి రోడ్, పందిపాడు గ్రామం, కర్నూలు.**

అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేయండి


మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేసి రసీదును సంబంధిత వ్యక్తులకు ఇవ్వాలని కలెక్టర్ రాజకుమారి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ చాంబర్ నుంయి జేసీ విష్ణుచరణ్‌తో కలిసి జూమ్ వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఇప్పటివరకు వచ్చిన అర్జీలలో ఉత్తమంగా పరిష్కరించిన వాటి వివరా లను పంపాలని ఆర్డీవోలను ఆదేశించారు.ఆర్డీఓలు, అన్ని మండలాల తహసీల్దారులు, మండల స్పెషల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

- నంద్యాల డీసీసీ ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్


క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్న పార్టీ కార్యకర్తలు

నంద్యాల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): యేసుక్రీస్తు బోధించిన మాటలు ప్రపంచంలోని మానవాళికి అనుసరణీయమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూసాని శ్రీనివాసరెడ్డి అన్నారు. క్రీస్తు పుట్టిక క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని నంద్యాల కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, ఏఐసీసీ సభ్యుడు, నంద్యాల జిల్లా డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా క్రిస్మస్ కేక్‌ను కట్‌చేసి పంపిణీ చేశారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రేమ, శాంతి, కరుణ క్రీస్తు బోధనల్లోని అంశాలు ప్రపంచమానవాళికై క్రీస్తు జీవితం ఓ సందేశం అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అన్ని మతాలను సమానంగా గౌరవిస్తుందన్నారు. సర్వమత స్వేచ్ఛకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. క్రైస్తవుల హక్కులకోసం, వారిసంక్షేమం కోసం గత వైసీపీ ప్రభుత్వం, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు జిలాన్‌బాష పీసీసీ సభ్యులు పఠాన్‌హబీబ్ ఖాన్, బాలస్వామి, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు జాకీర్‌హుసేన్, జిల్లా ఉపాధ్యక్షుడు బోయ రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్బుయాదవ్, నంద్యాల జిల్లాలోని నియోజకవర్గాల సమన్వయకర్తలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహానందిలో భక్తుల సొమ్ము చోరీ

మహానంది, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మహానందిలో శనివారం చోరీ జరిగింది. దైవదర్శనం కోసం తెలంగాణ రాష్ట్రం సిద్దిపేట నియోజిక వర్గంలోని రుద్రవరానికి చెందిన అందె శ్రీనివాసులు, కిషన్‌గౌడ్‌తో పాటు మరో ఐదుగురు మహానందికి కారులో వచ్చారు. ముందుగా ఆలయ ప్రాంగణంలోని రుద్రగుండం కోనేరులో పుణ్య స్నానం కోసం గట్టుపై తమ బ్యాగును ఉంచి వెళ్లారు. స్నానాలు చేసుకొనే తిరిగి వచ్చే సరికి అందె శ్రీనివాసులుకు చెందిన బ్యాగులోని రూ.15 వేల నగదుతో పాటు కారు తాళాలు, ఏటీఎం కార్డులు ఎత్తుకెళ్లారు. బాధితులు దేవస్థానం అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కోనేరు పరసరాల్లో ఏర్పాటు చేసిన సీసీ పుటేజీలను పరిశీలించగా ముగ్గురు వ్యక్తులు దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు. బాధిత భక్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భక్తులను అడ్డుకున్న అటవీ అధికారులు

ఆత్మకూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలం నల్లమల అటవీ ప్రాంతంలోని తిరుమలదేవుని కొండకు వెళ్లే భక్తులను శనివారం అటవీ అధికారులు అడ్డుకున్నారు. దీంతో వారు కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన భక్తులు తిరుమల దేవుడి కొండపై పుట్టు వెంట్రుకల కార్యక్రమానికి వెళ్లడానికి అటవీ అధికారులను ముందుగానే సంప్రదించి ఆరు ట్రాక్టర్లతో వెళ్లేందుకు రుసుము చెల్లించి అనుమతి పొందారు. అయితే ఆరు ట్రాక్టర్ల కంటే ఎక్కువ వాహనాలు ఉండటంతో అటవీ అధికారులు బైర్లూటి చెక్‌పోస్టు వద్ద అడ్డుకున్నారు. దీంతో భక్తులు కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. చివరకు షరతులతో అనుమతించడంతో సమస్య సద్దుమణిగింది.

హత్య కేసులో నిందితుల అరెస్టు

కోడుమూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): కోడుమూరులోని సుందరయ్య నగర్‌లో ఇటీవల జరిగిన బోయ మధుబాబు(25) హత్య కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు సీఐ తబ్రేజ్ తెలిపారు. కోడుమూరు సర్కిల్ పోలీసు స్టేషన్‌లో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. సుందరయ్య నగర్‌లో ఒక పెళ్లి వేడుకల్లో భాగంగా ఈ నెల 14న రాత్రి పెళ్లి ఊరేగింపు జరిగింది. సుందరయ్య నగర్‌లో నివాసం ఉంటున్న సురేంద్ర అలియాస్ సూరి, జంబులయ్య అనే ఇద్దరు యువకులు మద్యం తాగి పెళ్లి ఊరేగింపులో ఉన్న మహిళలంతా డాన్సు చేయాలని, వాళ్ల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారు. దీంతో అక్కడే ఉన్న బోయ మధుబాబు, దేవేంద్ర నాయుడు ఆ ఇద్దరిని అదుపు చేసే ప్రయత్నం చేశారు. ఇది జీర్ణించుకోలేని సూరి.. మధుబాబును చంపుతా దామని జంబులయ్యను రెచ్చగొట్టాడు. దీంతో బంబులయ్య పక్కనే ఉన్న రాయి తీసుకొని మధుబాబు ఎడమ కనితిపై బలంగా కొట్టాడు. దీంతో అపస్మారక స్థితికి చేరుకొన్న మధుబాబును కర్నూలు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఈ నెల 17న మృతి చెందారు. మధుబాబు సోదరుడు దేవేంద్రనాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొన్న పోలీసులు నిందితులు శనివారం వల్లెలాంబదేవి ఆలయం సమీపంలో ఉన్నట్లు తెలుసుకొని అరెస్టు చేశారు. నిందితులను డిమాండ్‌కు పంపిస్తున్నట్లు సీఐ చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ఏపీ శ్రీనివాసులు, హెడ్‌కానిస్టేబుల్ రాముడు, నాగన్న, కానిస్టేబుల్ రమేష్ తదితరులు ఉన్నారు.

గుండెపోటుతో రైతు మృతి

బనగానపల్లె, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందవరం గ్రామానికి చెందిన కమలపురి శివసుబ్బరాయుడు (42) అనే రైతు ధాన్యం ఆరబోసుకుంటుండగా గుండెపోటుతో మృతి చెందాడు. ఈ ఘటన గురువారం జరిగింది. గ్రామంలో పలువురు రైతులు శివసుబ్బరాయుడు మృతదేహానికి నివాళులర్పించారు. మండల టీడీపీ అధ్యక్షుడు పీవీ.కుమార్‌రెడ్డి, వెంగన్న రైతుకు నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు సంతాపం వ్యక్తం చేశారు. మృతుడిగా భార్య కృష్ణవేణి, కుమార్తెలు సురేఖ, సుధీర్, సుభాషిణి ఉన్నారు.

మహిళపై దాడి.. కేసు నమోదు

ఉయ్యాలవాడ, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని హరివరం గ్రామానికి చెందిన పాలాజి కాంతమ్మపై అదే గ్రామానికి చెందిన దండు ఆబేలు గొడ్డలితో దాడి చేసి గాయపరచినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. కొళాయి నీటి విషయంలో ఇరువురి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఇందులో కాంతమ్మను ఆబేలు గొడ్డలితో కొట్టి గాయపరచాడన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

కొండచిలువ హల్‌చల్

చాగలమర్రి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లేవేముల గ్రామంలో కొండచిలువ శనివారం రాత్రి హల్‌చల్ చేసింది. సుమారు 6 అడుగుల పొడవుగల కొండచిలువ పొలాల్లో నుంచి గ్రామంలోకి రావడంతో ఎస్సీ కాలనీ ప్రజలు భయాందోళన చెందారు. కొండ చిలువను హతమార్చడంతో కాలనీవాసులు ఊపిరి పీల్చుకున్నారు.



ఎస్సీ కాలనీలో కొండచిలువ

జీవితమంతా గణితమే

- మనసుపెట్టి నేర్చుకుంటే చాలా సులువు
- నేడు భారతీయ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి

ఆత్మకూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) మనం ఎప్పుడు పుట్టాం? ఈ పుట్టుక తేదీ నుంచి జీవితంలో గణితం ఆరంభమవుతుంది. ఆ తర్వాత జీవనయానం అంతా లెక్కలతోనే ముడిపడి వుంటుంది. పండితులు, పామరులు ఎవరైనా సరే ఏదో సందర్భంలో లెక్కలతో కుస్తీపట్టక తప్పదు. జీవితంలో ఇంత భాగమైపోయిన గణితమంటే చాలా మందికి భయం. వామ్మో.. లెక్కలా..? నా వల్ల కాదు బాబోయ్.. అనేవారే అధికం. కానీ కష్టపడి, ఇష్టంతో చేస్తే గణితాన్ని మించిన సులువైన శాస్త్రం మరొకటి లేదన్నది నిపుణుల అభిప్రాయం. జీరో నుంచి ప్రారంభించి హీరోగా ప్రపంచఖ్యాతి పొందిన శ్రీనివాస రామానుజన్ లెక్కలకు చుక్కాని వంటివారు. ఎన్నో లెక్కల తికమకలకు చక్కని పరిష్కారం చూపిన రామానుజన్ భారతీయ గణిత మేధావుల్లో అగ్రగణ్యుడు. ఈయన జయంతి డిసెంబరు 22న ప్రతి ఏటా గణిత దినోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ.





మాయా చదరాల మేధావి రామానుజన్

గణితం సర్వంతర్యామి. ప్రతి అంశంలోనూ గణితానికి భాగస్వామ్యం వుంది. అందుకే విద్యార్థి దశలో గణితానికి అంత ప్రాధాన్యత ఇస్తారు. వాస్తవానికి అన్ని శాస్త్రాల్లోనూ గణితం మిళితమై వుంటుంది. ఉదాహరణకు సాంఘికశాస్త్రంలో అక్షాంశాలు, రేఖాంశాలు, దేశాల విస్తీర్ణాలు, మ్యాప్‌ల నిర్మాణంలో వున్న నిష్పత్తులు మొదలైనవన్నీ గణితమే. సైన్స్‌లో భారం, ద్రవ్యరాశి, మూలకాల ఆవర్తనం, సమీకరణాలు, జీవక్రియలన్నీ గణిత ప్రస్తావనతోనే సాధ్యం. భాషా వ్యాకణాలలోనూ గణితం వుంటుంది. ప్రస్తుతం అన్ని పోటీ పరీక్షల్లో గణితం తప్పనిసరి అయింది.

తన పుట్టిన రోజు 22.12.1887తో మాయా చదరాన్ని సృష్టించిన మేధావి శ్రీనివాసరామానుజన్. 16 గడుల చదరంలో ఏ నిలువు వరుస కూడినా, అడ్డువరుస కూడిన మొత్తం 139 వస్తోంది. కర్ణాలు, మూలాలు, మధ్య చదరం, మూల సంఖ్య మొత్తం, మూల చదరాల మొత్తం అన్నీ 139 సంఖ్యనే చూపిస్తాయి. ఇటువంటి మాయా చదరాలు ఎన్నో సృష్టించిన వ్యక్తి రామానుజన్. తన పదో ఏటనే ఉపాధ్యాయుడిని సున్నాతో సున్నాను గుణిస్తే 1 వస్తుందా అని అడిగిన ప్రతిభాశాలి. హైస్కూల్ రోజుల్లో 40 మంది ఉపాధ్యాయులకు టైమ్ టేబుల్ రూపొందించి గుర్తింపు సాధించారు. అధ్యాపకులు సాధించలేని సమస్యలను తాను క్లుప్తంగా సాధించేవారు. మ్యాజిక్‌స్కయర్, కంటిన్యూడ్ ఫ్రాక్షన్స్ ప్రధాన సంఖ్యలపై పరిశోధనలు చేశారు. ఆంధ్ర యూనివర్సిటీలోని ఆయన చేతిరాత ప్రతుల ద్వారా ఇది తెలుస్తోంది. ఓ జర్నల్‌లో వచ్చిన సమస్యను సాధించి ఫలితాన్ని కేంబ్రిడ్జి యూనివర్సిటీ ఆచార్యులు జీహెచ్ హర్డికి పంపించడంతో రామానుజన్ ప్రతిభ ప్రపంచానికి తెలిసింది. త్రికోణమితికి సంబంధించిన సూత్రాలు సాధించడం, మాక్ థీటా ఫంక్షన్స్‌పై పరిశోధనలు నేడు అనేక రంగాల్లో ఉపయోగపడుతున్నాయి. 1729ని రామానుజన్ నంబర్‌గా పిలుస్తారు. ఆ నంబర్‌కు ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయని ఆయన తెలిపారు. ఆ సంఖ్యను 10, 9ల ఘనాల మొత్తంగా 12, 1 ఘనాల మొత్తంగా మూడు ప్రధాన సంఖ్యల లబ్దంగా 19, 91ల లబ్దంగా చూపాడు. ఓ కారు నంబర్‌గా ఉన్న ఈ నంబర్‌ను చూసి ఈ విషయాలన్ని కనుగొన్నారు రామానుజన్.

ఇష్టపడి చదివితే గణితం లాంటి సబ్జెక్ మరొకటి లేదు



ఇష్టపడి చదివితే గణితం లాంటి సులువైన సబ్జెక్ట్ మరొకటి లేదు. చాలా మంది లెక్కల సబ్జెక్ట్ అంటేనే భయపడతారు. అలాంటి వారు గణితం మక్కువ చూపితే ఏ సమస్యనైనా సులభంగా సాధించవచ్చు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారు గణితంలోని మెలకువలను తెలుసుకుంటే మరింత ప్రయోజనకరంగా ఉంటుంది.

- డాక్టర్ ఎస్వీఆర్. శేఖరరెడ్డి, గణిత అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆత్మకూరు.

పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం వద్దు...

- సీడీఎంఏ కన్నబాబు

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగర పాలక, మున్సిపాలిటీల్లో పన్ను వసూళ్లపై నిర్లక్ష్యం వహించరాదని కమిషనర్ ఆఫ్ డైరెక్టరేట్ అండ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) కన్నబాబు తెలిపారు. శనివారం రాత్రి నగర పాలక కార్యాలయంలో నగర పాలక సంస్థ, డోన్ మున్సిపాలిటీ, నందికొట్కూరు మున్సిపాలిటీకి సంబంధించిన కమిషనర్లతో రెవెన్యూ సెక్షన్, టౌన్ ప్లానింగ్, తాగునీటి పన్ను వసూళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు, డోన్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు, అడిషినల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ పాల్గొన్నారు. ఈ మేరకు నగర పాలక మున్సిపాలిటీలో జరిగే వివిధ అభివృద్ధి పనులపై డైరెక్టర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పన్ను వసూళ్లు, తాగునీటి సరఫరా, పారిశుధ్యానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా నగర పాలకను మొదటి స్థానంలో నిలిపేందుకు అధికారులు కృషి చేయాలని డైరెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో నగర పాలక సంబంధించి సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, మెడికల్ హెల్త్ ఆఫీసర్ డా.కే.విశ్వేశ్వరరెడ్డి, ఎస్‌ఈ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న సీడీఎంఏ కన్నబాబు

కన్నబాబును సన్మానించిన టీఎన్‌టీయుసీ నాయకులు : తెలుగు నాయుడు యూనియన్ ట్రేడ్ నాయకులు సీడీఎంఏ కన్నబాబును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రమణ, ఎంవీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు డీఎంహెచ్‌వోగా డాక్టర్ శాంతికళ

- స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్

సీఎస్ఆర్‌ఎంవోగా బి.హేమనళిని


డాక్టర్ పి.శాంతికళ

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా వైద్యఆరోగ్య శాఖలో 9 నెలల ఇన్‌చార్జి పాలనకు తెరపడింది. కడప జిల్లా జమ్మలమడుగు డిప్యూటీ డీఎంహెచ్‌వోగా పని చేస్తున్న డాక్టర్ పి.శాంతికళకు సివిల్ సర్జన్‌గా పదోన్నతి కల్పించి కర్నూలు డీఎంహెచ్‌వోగా నియమించారు. ఈ మేరకు శనివారం వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కేజీ కృష్ణబాబు ఆదేశాలు జారీ చేశారు. దీంతో గత 9 నెలలుగా ఇన్‌చార్జి పాలనకు తెరపడినట్లయింది. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో డిప్యూటీ సీఎస్ఆర్ఎంవోగా పని చేస్తున్న డాక్టర్ బి.హేమనళినిని కర్నూలు స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ సీఎస్ఆర్ఎంవోగా నియమించారు. బనగానపల్లె పీహెచ్‌సీలో పని చేస్తున్న సివిల్ సర్జన్ డా.టీవీ బాలమురళికృష్ణను శ్రీకాకుళం డీఎంహెచ్‌వోగా నియమించారు. కర్నూలు బీ.క్యాంపు సివిల్ డిస్పెన్సరీగా పని చేస్తున్న డా.సీహెచ్ రామకృష్ణను అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి సీఎస్ఆర్ఎంవోగా నియమించారు. 2023-24 సంవత్సరానికి డిప్యూటీ సివిల్ సర్జన్‌గా ఉన్న 21 మందికి సివిల్ సర్జన్‌గా ప్రభుత్వం పదోన్నతి కల్పించి పోస్టింగ్స్ వేసింది. అందులో భాగంగా జిల్లా నుంచి ముగ్గురు వైద్యులు పదోన్నతులు పొంది కొత్త పోస్టింగ్‌లో బాధ్యతలు చేపట్టనున్నారు.

ఎంపీపీ, వైద్యులను విచారించిన సీఈవో

చాగలమర్రి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి మండల ఎంపీపీ వీరభద్రుడు వేధిస్తున్నాడంటూ వైద్యురాలు అంజలి చేసిన ఫిర్యాదు మేరకు జడ్పీ సీఈవో నాసరరెడ్డి శనివారం విచారణ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ వైద్యురాలు అంజలి విధి నిర్వహణపై ఎంపీపీ ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశారని, అందువల్ల మానసికక్షోభకు గురై విధులు నిర్వహించలేక పోతున్నానని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టామని అన్నారు. ఎంపీపీ వీరభద్రుడు, వైద్యురాలు అంజలిని విడివిడిగా విచారణ చేశామని అన్నారు. ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, తహసీల్దార్ రవికుమార్ నుంచి కూడా వైద్యురాలి పనితీరుపై నివేదికలు తెప్పించుకొని తుది నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని అన్నారు. ఈ విచారణలో ఎంపీపీ మాట్లాడుతూ వైద్యురాలు అంజలిని తాను వేధిస్తున్నారంటూ ఫిర్యాదు చేయడం సమంజసంగా లేదని, హెచ్‌డీఎఫ్‌సీ నిధులను కమిటీ సమావేశం తీర్మానం లేకుండా నిధులు దుర్వినియోగం చేశారని అన్నారు. తాను బాధ్యతగా విధి నిర్వహణ చేశానే తప్ప వేధించలేదని అన్నారు. డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, జిల్లా నోడల్ అధికారి జగదీష్‌చంద్రారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.


విచారణ చేస్తున్నజడ్పీ సీఈవో

ఈరన్న సన్నిధిలో మంత్రి టీజీ భరత్

కౌతాళం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి వారిని శనివారం పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న మంత్రికి అర్చకులు, అధికారులు, పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం భరత్ స్వామివారి సన్నిధిలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రిని ఆలయ అధికారులు ఘనంగా సత్కరించారు. టీజీ భరత్ మాట్లాడుతూ తమ ఇంటి దైవం ఉరుకుంద ఈరన్న స్వామి అని, కుమార్తె వివాహం త్వరలో ఉండటంతో మొక్కులు తీర్చుకునేందుకు వచ్చానని తెలిపారు. మంత్రి వెంట ఆలయ అధికారులు వెంకటేశ్వరరావు, విజయ్ కుమార్, ఆలయ ప్రధాన అర్చకుడు ఈరప్ప స్వామి, అర్చకులు శివన్న, నాగరాజు, కౌతాళం సీఐ అశోక్ కుమార్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్న బసప్ప, కౌతాళం సాగునీటి సంఘం అధ్యక్షుడు డింగి రఘరాం, నాయకులు భరద్వాజ్ శెట్టి, రామకృష్ణారెడ్డి, కురుగోడు, రమేష్‌గౌడ్, దొడ్డనగౌడ్, సిద్దు, మహదేవ తదితరులు ఉన్నారు.


మంత్రికి స్వాగతం పలుకుతున్న ఆలయ అర్చకులు

భోజనంలో ఈగలు... సాంబార్‌లో బొద్దింకలు..!

కస్టమర్ల నుంచి ఫిర్యాదులు • ఆత్మకూరు గీతా మెస్‌కు రూ.50వేలు జరిమానా విధింపు

ఆత్మకూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నాణ్యత, శుభ్రత పాటించాల్సిన హోటళ్ల నిర్వాహకులు నిబంధనలను ఏమాత్రం లెక్క చేయడం లేదు. తాజాగా ఆత్మకూరు పట్టణంలోని గీతా హోటల్‌లో కస్టమర్లకు ఇచ్చిన ఆహారంలో ఈగలు, సాంబార్‌లో బొద్దింకలు వచ్చిన ఘటన చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై ఫిర్యాదులు అందుకున్న అధికారులు విచారణ చేసి రూ.50వేలు జరిమానా విధించారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఫుడ్ సేఫ్టీ అధికారులు ఖాశింవలి, వెంకటరాముడు శనివారం వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కొంతమంది కస్టమర్లు హోటల్‌కు భోజనం చేయగా సాంబార్‌లో బొద్దింక, ఈగలు రావడంతో ఇదేమని నిర్వాహకులను కస్టమర్లు ప్రశ్నించారన్నారు. అయితే నిర్వాహకులు బాధ్యతా రహితంగా వ్యవహరించడంతో పాటు ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకో అంటూ దురుసుగా సమాధానం చెప్పారన్నారు. దీంతో కస్టమర్లు తమకు ఫిర్యాదు చేశారన్నారు. తాము హోటల్‌ను, అక్కడి పరిసరాలను పరిశీలించి నివేదికను జేసీ విష్ణు చరణ్ తేజకు సమర్పించామన్నారు. ఆయన నివేదికన పరిశీలించి హోటల్ యజమానికి రూ.50వేలు జరిమానా విధించినట్లు ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ ఖాశింవలి వెల్లడించారు.



అధికారులు జరిమానా విధించించిన హోటల్ ఇదే..

కర్నూలు

కర్నూలు ● కోడుమూరు ● పాణ్యం

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్‌ను చూపుతున్న విద్యార్థులు

గూడూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గూడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సంకల్ప 2024 పథకం కింద విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేసినట్లు ప్రిన్సిపాల్ ప్రసన్న కుమారి తెలిపారు. శనివారం గూడూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రభుత్వం సంకల్ప 2024 పథకం కింద స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యారమ్స్ పోటీలకు బయలుదేరిన జిల్లా జట్టు



క్యారమ్స్ పోటీలకు బయలుదేరి వెళ్తున్న క్రీడాకారులు

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా సింగరాయకొండలో ఈ నెల 22, 23 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 బాలబాలికల క్యారమ్స్ పోటీలకు శనివారం ఉమ్మడి జిల్లా జట్టు బయలుదేరి వెళ్లారు. స్థానిక డీఎస్‌ఏ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ గిడ్డయ్య, నంద్యాల కార్యదర్శి శ్రీనాథ్‌లు వీడ్కోలు పలికి విజయంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు.

టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాసులుకు పదోన్నతి

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): తూనికలు, కొలతల శాఖ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులుకు ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి కల్పించారు. శనివారం వెంకటరమణ కాలనీలోని కార్యాలయంలో డిప్యూటీ కంట్రోలర్ దయాకర్‌రెడ్డి చేతుల మీదుగా శ్రీనివాసులు పదోన్నతి పత్రాన్ని అందుకున్నారు. అదే విధంగా ఆదోని ఇన్‌స్పెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అక్కడ పని చేస్తున్న ఇన్‌స్పెక్టర్ జీవీ. వరప్రసాద్ మాతృసంస్థ ఆరోగ్యశాఖకు వెళ్లారు. దీంతో ఆదోనిలో పూర్తిస్థాయి ఖాళీ ఏర్పడటంతో అక్కడ నియమించారు. త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు.

పర్యావరణాన్ని కాపాడుకోవాలి

కర్నూలు అర్బన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): పర్యావరణం, ప్రకృతికి కాపాడుకున్నప్పుడే మానవ మనుగడ ఉంటుందని ఇన్‌చార్జి ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ అన్నారు. శనివారం రాయలసీమ యూనివర్సిటీలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో మహిళా వసతి గృహం వద్ద పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వసతి గృహాల చుట్టు పేరుకుపోయిన చెత్త చెదారాన్ని తొలగించి శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పి. నాగరాజు, విజయుడు, నాగచంద్రుడు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని రీసోర్స్ పర్సన్ల వేతనాలు పెంచాలని 23న కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సిటీ మెప్మా ఆర్పీ ఉద్యోగుల సంఘం నగర అధ్యక్షురాలు పి. రుద్రమ్మ పిలుపునిచ్చారు. శనివారం కార్మిక కర్షక భవన్‌లో నగర కార్యదర్శి షబానా అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆర్పీలకు పెండింగ్ వేతనాలు చెల్లించకుండ ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయన్నారు. హెచ్ఆర్ పాలసీ అమలు చేసి గ్రేడింగ్ విధానం రద్దు చేయాలన్నారు. భవిష్యత్తులో పొదుపు మహిళల మద్దతుతో ఉద్యమాలు చేసి పాలకుల మెడలు వంచి హక్కులు సాధించుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎస్.ఉమాదేవి, రాముడు, సాయిబాబ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో రాణించాలి

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాలెంలో జరిగే ఈ నెల 22, 23 తేదీల్లో రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళ హ్యాండ్‌బాల్ పోటీల్లో రాణించాలని జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు బి.రామాంజనేయులు పిలుపునిచ్చారు. శనివారం నగరంలో ఏర్పాటు చేసిన క్రీడా కిట్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొని పాల్గొని క్రీడాకారులకు కిట్లను పంపిణీ చేశారు. అనంతరం జట్టు వివరాలు వెల్లడించారు. మృదువల్లిక, రాజ్యలక్ష్మి, పుణ్యవతి, కవిత, సువర్ణ, ఇంద్రజ, గంగావతి, మౌనిక, శ్రీవాణి, మౌనిక, నిత్యశ్రీ, చంద్రిక, రామతులసమ్మ, కోచ్‌గా నాగ శ్రీనివాసులు, రాఘవేంద్ర వ్యవహరిస్తున్నట్లు తెలిపారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

కల్లూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): సచివాలయానికి వచ్చే ప్రజలకు మెరుగైన సేవలందించాలని కర్నూలు డీఎల్‌డీవో రమణారెడ్డి సిబ్బందికి సూచించారు. శనివారం ఆయన ఎంపీడీవో జి.నాగేశాచలరెడ్డితో కలిసి పర్ల, ఏ.గోకులపాడు సచివాలయాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. వివిధ సేవలకై సచివాలయాలకు వచ్చే ప్రజలకు సకాలంలో స్పందించి ప్రభుత్వ పథకాలను అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే పర్ల గ్రామంలో ఆధార్ కేంద్రాన్ని పరిశీలించి సమస్యలను తెలుసుకున్నారు.

సెలవు రోజుల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కల్పించాలి

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు వంద రోజుల ప్రణాళికలో భాగంగా శని, ఆదివారాలు సెలవు రోజుల్లో మధ్యాహ్న భోజనం, బస్సు సౌకర్యం కల్పించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి.హృదయ రాజు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.ఇస్మాయిల్, ఐ.మరియానందంలు డీఈవో ఏడీ-2 కె.నాగభూషణంకు శనివారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు శ్రీనివాసరెడ్డి, రామకృష్ణయ్య, ఖాన్, రామప్రసాద్ రెడ్డి, నరేంద్రనాథ్ పాల్గొన్నారు.

● **స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు వాయిదా:**

క్రిస్టియన్ మైనార్టీ పాఠశాలలకు 25 నుంచి 29వ తేదీ వరకు ప్రభుత్వం సెలవులు ప్రకటించిందని, ఈ మేరకు డిసెంబరు 26 నుంచి మొదలయ్యే ఎస్ఎల్ఎన్ ట్రైనింగ్స్, 27, 28 తేదీల్లో నిర్వహించే స్కూల్ కాంప్లెక్స్‌ను వాయిదా వేయాలని కోరగా.. అందుకు రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ వాయిదా వేసినట్లు వివరించారు.

విద్యార్థులకు మెడికల్ క్యాంపు

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక చిన్నటేకూరు ఐఐటీ మెడికల్ అకాడమి క్యాంపస్‌లో శనివారం విద్యార్థులకు ఉచిత మెడికల్ క్యాంపు జరిగింది. ఉలిందకొండ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డా.రఘు ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐఐటీ మెడికల్ అకాడమి డైరెక్టర్ ఉమామహేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'డ్రైవర్లు కంటి సంరక్షణపై అప్రమత్తంగా ఉండాలి'

కర్నూలు కల్చరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): దూర ప్రాంతాలకు వెళ్లే వాహన డ్రైవర్లు తమ కంటి సంరక్షణపై అప్రమత్తంగా ఉండాలని భారత్ గ్యాస్ ప్లాంట్ మేనేజర్ అరుణ్‌కుమార్ సూచించారు. శనివారం భారత్ గ్యాస్ ఎల్పీజీ టెరిటరీ గ్యాస్ ఫిల్లింగ్ ప్లాంట్ ఆవరణలో, భారత్ గ్యాస్ సంస్థ, బాలసాయి కంటి ఆసుపత్రి, లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ సంయుక్త ఆధ్వర్యంలో వాహన డ్రైవర్లు, కార్మికులకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

ఓర్వకల్లులో సెమీ కండక్టర్ పరిశ్రమ

● అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ఓర్వకల్లు మండల మీట్‌లో ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

ఓర్వకల్లు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో తొలి సెమి కండక్టర్ పరిశ్రమ ఓర్వకల్లులో ఏర్పాటు చేయడం అభినందనీయమని, అలాగే అభివృద్ధి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. శనివారం ఓర్వకల్లులోని ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎంపీపీ తిప్పన్న అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో గతంలో చర్చించిన అంశాలు, వాటి పురోగతిపై ఆయా శాఖ అధికారులు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో వచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరించేలా అధికారులు చొరవ చూపాలన్నారు. మండలాన్ని ప్రగతి పథంలో నడిపించడానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ఓర్వకల్లులో 300 ఎకరాల్లో డ్రోన్ పరిశ్రమ ఏర్పాటుకు స్థలం కూడా సేకరించడం జరిగిందని, డ్రోన్ అధికారులు సానుకూలంగా స్పందించారన్నారు. అలాగే భారత దేశంలో తొలి సెమి కండక్టర్ పరిశ్రమ కారిడార్‌లో భాగంగా ఓర్వకల్లులో పరిశ్రమ స్థాపనకు రూ.14వేల కోట్ల పెట్టుబడితో పరిశ్రమ స్థాపించబోతున్నారన్నారు. పరిశ్రమలతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తాయని క్రిస్మస్ పండుగ మధ్యలో రావడం శుభపరిణామమన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం దిశగా పయనిస్తుందన్నారు. వైసీపీ పాలనలో ఎలాంటి పరిశ్రమలు రాలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్నో పరిశ్రమలు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విద్యాసాగర్, ఏవో సుధాకర్, ఎంఈవో ఓంకార్ యాదవ్, జడ్పీటీసీ రంగనాథగౌడు, టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసులు, ఈవోఆర్‌డీ సుబ్బరాయుడు, తహసీల్దార్ విద్యాసాగర్, ఇంజనీర్లు శ్రీనివాసులు, నరేంద్రనాథ్‌రెడ్డి, రామయ్య, సర్పంచులు చంద్ర గోవర్దనమ్మ, అయ్యస్వామి, పెద్దకాశీం, ఎంపీటీసీలు జీకే చిన్నమ్మ, సరోజమ్మ, పుల్లయ్య, సోమశేఖర్ రెడ్డి, పద్మనాభ రెడ్డి, నాగ శిరీష, ఎస్ఐ సునీల్ కుమార్ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

కల్లూరు: టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత అన్నారు. శనివారం తన స్వగృహంలో అర్హులైన బాధితులకు ఎమ్మెల్యే రూ. 12,49, 804 రూపాయల సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఆకేపోగు పూలరాజుకు రూ. 35787, శివశంకర్‌రెడ్డికి రూ. 34,629, బొంతల సతీష్‌కుమార్‌కు రూ.65,000, ఎ.వెంకటరామిరెడ్డికి రూ. 65,719, కురువ శకుంతలకు రూ. 1,08, 600, తూము బాలీశ్వరరెడ్డికి రూ. 37,983, పెరుమల రాజేష్‌కు రూ. 6.02086, సయ్యద్ అబ్దుల్ కరీంకు రూ. 50,000, సత్యనారాయణకు రూ. 250,000 చెక్కులను అందజేశారు.

గణిత శాస్త్రంపై ఆసక్తి ఉండాలి



శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న పాఠశాలల ఉపాధ్యాయురాలు అరుణ

కర్నూలు అర్బన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): గణిత శాస్త్రంను ఆసక్తితో చదివీ అత్యున్నత అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. ఇందిరా శాంతి అన్నారు. శనివారం ప్రభుత్వ డిగ్రీ బాలుర కళాశాలలో జాతీయ గణిత శాస్త్ర దినోత్సవం సందర్భంగా శ్రీనివాస రామానుజం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈస ందర్భంగా అమె మాట్లాడుతూ గణిత శాస్త్రవేత్త రామానుజన్‌ను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకొని ప్రపంచ స్థాయికి ఎదిగే విధంగా చదువుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో గణిత శాస్త్ర విభాగాధిపతి ఎం కృష్ణారెడ్డి, వైఎస్ ప్రిన్సిపల్ హేమంత్, ఆధ్యాపకులు జాఫరున్నీసా, ఎల్ నాగరాజు, మురళీధర్, లక్ష్మణ గుప్త, విద్యార్థులు పాల్గొన్నారు.

● కేవీఆర్ కళాశాలలో గణిత దినోత్సవం సందర్భంగా శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పోస్టర్ ప్రదర్శన పోటీలు, పుస్తక ప్రదర్శన పోటీల్లో ప్రతిభ కనపరిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో గణిత శాస్త్ర అధ్యాపకులు దేవీకారాణి, ప్రభుచరణ్, కె. వెంకటరెడ్డి, ఎస్ సునీతా, విద్యార్థులు హాజరయ్యారు.

కర్నూలు ఎడ్యుకేషన్: స్థానిక కృష్ణానగర్‌లోని సర్వేపల్లి పాఠశాలలో శనివారం జాతీయ గణిత దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యంగా శ్రీనివాసరామానుజన్ చిత్రపటానికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కేపీ అరుణశ్రీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు తయారు చేసిన మైట్ మ్యాట్, ఎస్‌పీవీఎన్ వర్కింగ్ మోడల్స్, గోల్డెన్ రేషియో, ఐరీడ్ యువర్ మైండ్ వంటి ప్రాజెక్టులను ప్రదర్శించారు.

ఫ్లైఓవర్ కింద రేకుల కంటైనర్‌ను తొలగించాలి

కల్లూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): గుత్తి ఫ్లైఓవర్ కింద లీజు పొందిన గుత్తేదారుడు నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన రేకుల కంటైనర్‌ను తొలగించాలని 29వ వార్డు కార్పొరేటర్ ఎస్.సుదర్శన్‌రెడ్డి కోరారు. శనివారం ఆయన నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్ రవీంద్రబాబును కలిసి సదరు గుత్తేదారుడిపై చర్యలు తీసుకోవాలని స్థానిక మహిళలతో కలిసి వినతిపత్రం అందజేశారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పార్కింగ్ స్థలం లీజుకు తీసుకుని లీజు ప్రకటనలో జారీ చేసిన 1200 చదరపు అడుగుల స్థలం కంటే ఎక్కువగా వాడుతున్నాడన్నారు. స్కూటర్, కారు పార్కింగ్ మాత్రమే ఉపయోగించాలని, అందుకు విరుద్ధంగా రేకుల కంటైనర్ వేశాడని, షెడ్ తొలగించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు.

ఆర్టీసీలో డోర్ డెలివరీ ప్రచార మాసోత్సవం

కర్నూలు రూరల్ డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్‌ఆర్టీసీలో ఈనెల 20 నుంచి వచ్చేనెల 19వ తేదీవరకు డోర్ డెలివరీ ప్రచార మాసోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కర్నూలు-2డిపో మేనేజర్ సర్దార్‌హుస్సేన్ శనివారం తెలిపారు. సరుకు రవాణాలో ఆర్టీసీ మరో ముందడుగు వేసిందని, ఇంటి వద్దకే సరుకు రవాణా చేయనున్నట్లు వివరించారు. 50కేజీల బరువు కలిగిన పార్శిల్ కూడా డోర్ డెలివరీ సౌకర్యం ఆర్టీసీకార్గో చేయనున్నట్లు ఆయన తెలిపారు. పార్శిల్, కొరియర్ డోర్‌డెలివరీ చార్జీల వివరాలను సంబంధించిన ఆర్టీసీ అధికారులను సంప్రదించాలని డిపో మేనేజర్ సర్దార్‌హుస్సేన్ సూచించారు. ప్రతి ఒక్కరు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న ధనుర్మాస వేడుకలు



వాసవి నగర్ వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలకు హాజరైన భక్తులు



కర్నూలు కల్చరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం సందర్భంగా నగరంలోని వివిధ వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. శనివారం నగరంలో ఉల్చాల రోడ్డులోని వాసవీనగర్‌లోగల వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో గోదా, రంగనాథ స్వామి వార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 5 గంటలు సుప్రభాత సేవ, ఆరాధన, అభిషేకం, గోత్రానామాణి అర్చనలు, వేద స్వస్తి, తీర్థప్రసాద గోష్ఠి నిర్వహించారు. సాయంత్రం సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం, గోవింద నామ సంకీర్తనలు, రాత్రి ఏకాంత సేవ నిర్వహించారు. కార్యక్రమాల్లో యాలిశెట్టి భద్రయ్య శెట్టి కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

●నగర శివారులోని మామిదాలపాడులో వెలసిన శ్రీ గోదా రంగనాథ స్వామివారి క్షేత్రం గోదా గోకులంలో ధనుర్మాస మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం ఆలయంలో ఉదయం 4.30 గంటలకు నిత్య ఆరాధన, శ్రీదేవీ భూదేవీ సమేత రంగనాథస్వామి భోగమూర్తులకు, గోదా కృష్ణులు, సాలగ్రామాలకు అభిషేకం నిర్వహించారు. 5గంటలకు అలంకరణ సేవ, తోమాల సేవ, తెలుగులో తిరుప్పావై పఠనం చేశారు. శ్రీరంగనాథ, శ్రీలక్ష్మి, గోదాదేవి అమ్మవార్లకు అష్టోత్తర శతనామార్చన చేశారు.

'అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి'

కర్నూలు కల్చరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): అంబేద్కర్‌ను కేంద్ర మంత్రి అమిత్ షా అవమానించిన సంఘటనకు నిరసనగా ప్రజాస్వామ్య సంఘాల ఐక్యవేదిక నాయకులు శనివారం కలెక్టరేట్ వద్ద మహాత్ముని విగ్రహం ముందు నిరసన ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల బాధ్యులు హాజరై అమిత్ షా రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ నిరసనలో శ్రీనివాసరావు, రాయలసీమ విద్యావంతుల వేదిక కన్వీనర్ అరుణ్, భాస్కరరెడ్డి, పౌర హక్కుల సంఘం నాయకుడు అల్లాబకాష్, ప్రజాస్వామ్య సంఘాల ఐక్య వేదిక కన్వీనర్ రామకృష్ణారెడ్డి, ప్రజా పరిరక్షణ సమితి నాయకుడు రవికుమార్, రైతు కూలీ సంఘం నాయకుడు సుంకన్న, ఎస్‌డీపీఐ నాయకులు చంద్‌బాషా, యోహాను, కేఎన్‌పీఎస్ నాయకులు సుబ్బరాయుడు, డీటీఎఫ్ బాధ్యుడు రత్నం ఏసేపు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యమే మహాభాగ్యం

● సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి



యోగా గురువును సన్మానిస్తున్న సెక్రటరీ జయలక్ష్మి

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ ఆరోగ్యంతో పాటు మనశ్శాంతిని పొందాలంటే యోగా భ్యాసనం అలవాటుగా మార్చుకోవాలని కర్నూలు మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి పిలుపునిచ్చారు. శనివారం యోగా ధ్యానం దినోత్సవం సందర్భంగా యోగా గురువులను మార్కెట్ కమిటీ కార్యాలయంలో సెక్రటరీ జయలక్ష్మి సన్మానించారు. యోగా ధ్యానాన్ని ప్రతి ఒక్కరూ అలవాటుగా మార్చుకుని సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందాలని పలువురు వక్తలు సూచించారు.

గూడూరు: గూడూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ప్రిన్సిపాల్ ప్రసన్న కుమారి ఆధ్వర్యంలో అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం సందర్భంగా ధ్యాన మహోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు చంద్రశేఖర్, కోటేశ్వరి, జయశ్రీ, శాంతి ప్రియ, మాధవిలత, రాధమ్మ, సాంబశివరావు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడి అధికమించేందుకే ధ్యానం సాధన



మాట్లాడుతున్న కేఎస్‌వీ రాజశేఖర్

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి మానసిక ఒత్తిడిని అధికమించేందుకు ప్రతి రోజు క్రమం తప్పకుండా ధ్యానంలో సాధన చేయాలని మాంటిస్సోరి విద్యాసంస్థల డైరెక్టర్ కేఎస్‌వీ రాజశేఖర్ అన్నారు. శనివారం 1వ ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండస్ పాఠశాల ఆవరణలో 441 మంది విద్యార్థులతో ధ్యానం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కే.పుల్లారెడ్డి కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ సురేష్, ప్రధానోపాధ్యాయురాలు మీనాక్షి విల్సన్, సీబీఎస్ఈ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, కోఆర్డినేటర్ వేణుగోపాల్ రెడ్డి, యోగా శిక్షకులు బోయ శ్రీనివాసులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీపీ రాజేశ్, అశోక్, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం వేర్‌హౌస్ పరిశీలన

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): త్రైమాసిక తనిఖీల్లో భాగంగా ఈవీఎంలు భద్రపరిచిన వేర్‌హౌస్‌ను కలెక్టర్ పి.రంజిత్ బాషా పరిశీలించారు. శనివారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టరేట్ ప్రాంగణంలోని ఈవీఎం వేర్‌హౌస్‌లో ఈవీఎంలను భద్రపరిచిన తీరును కలెక్టర్ పరిశీలించారు. ఈవీఎం వేర్‌హౌస్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. గోడౌన్స్‌లోని ఇంటర్నల్ పార్టిషన్లకు ప్రస్తుతం ఉన్న తాళాల కంటే పెద్ద తాళాలు వేయించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సంబంధిత రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు. కలెక్టర్ వెంట డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ మురళి, టీడీపీ జనరల్ సెక్రటరీ ఎల్‌వీ ప్రసాద్, బీజేపీ స్టేట్ ఎలక్షన్ సెల్ ప్రతినిధి సాయిప్రదీప్, వైసీపీ పార్టీ ప్రతినిధి కే.పుల్లారెడ్డి, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి షేక్ ఇజాజ్ అహ్మద్, బీఎస్‌సీ ప్రతినిధి అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

'జి. హోసళ్లిలో వివక్షను రూపుమాపాలి'

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆదోని మండలం జి.హోసళ్ల గ్రామంలో కుల వివక్షతను రూపుమాపాలని కుల వివక్ష పోరాట సమితి జిల్లా కార్యదర్శి ఎండి.ఆనంద్ బాబు డిమాండ్ చేశారు. శనివారం బుధవారపేటలోని సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పశ్చిమ ప్రాంతంలో నేటిక కుల వివక్షత, అంటరానితనం విలయతాండం చేస్తుందన్నారు. వాటిని అధికారుల దృష్టికి తీసుకువచ్చిన పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే కలెక్టర్, ఎస్పీలు గ్రామాన్ని సందర్శించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఎన్.జి.కృష్ణ, నాయకులు బతుకన్న పాల్గొన్నారు.

శ్రీచైతన్య పాఠశాలలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు



కేక్‌ను కట్ చేస్తున్న ప్రిన్సిపాల్ సుహాసిని

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనగర్ కాలనీలోని శ్రీచైతన్య పాఠశాలలో శనివారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీచైతన్య పాఠశాలల ఏజీఎం సురేష్ మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ గొప్పతనాన్ని వివరించారు. ప్రజలకు విముక్తి మార్గానికి చూపడానికి వచ్చిన వారు యేసుక్రీస్తు అని అన్నారు. విద్యార్థులు శాంతాక్లాజా, దేవదూతల వేషాధారణలు వేసి క్రీస్తు జన్మించిన విధానాన్ని చక్కగా ప్రదర్శించారు. కార్యక్రమంలో ఆర్ఐ రామంజనేయులు, ప్రిన్సిపాల్ సుహాసిని, డీన్ హుశేన్, ఇన్‌చార్జిలు పావని, వనజ, వెంకటలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

రవీంద్ర జూనియర్ కళాశాలలో ఘనంగా వార్షికోత్సవం



మాట్లాడుతున్న జి.పుల్లయ్య

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక అబ్బాస్ నగర్‌లోని రవీంద్ర, శ్రీకృష్ణ జూనియర్ కళాశాలల వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. రవీంద్ర విద్యాసంస్థల వ్యవస్థాపకులు జి.పుల్లయ్య మాట్లాడుతూ విద్యార్థి దశ చాలా బాధ్యతతో కూడుకున్నదని, ఈ సమయాన్ని నిర్లక్ష్యం చేయరాదన్నారు. మీ చదువులకు పునాది ఇంటర్ విద్యనే కీలకమన్నారు. ప్రతి విద్యార్థి బాధ్యతతో కష్టపడి చదివి తల్లిదండ్రుల ఆకాంక్షను నెరవేర్చాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అకడమిక్ అడ్వైజర్ డా.జి.మమతా మోహన్, కోఆర్డినేటర్ సురేంద్రనాథ్ రెడ్డి, ప్రిన్సిపాల్ వై.ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు పరిశోధనల వైపు దృష్టి పెట్టాలి

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులు పరిశోధనలవైపు, నూతన ఆవిష్కరణల వైపు దృష్టి పెట్టాలని మంగళూరు ప్రొఫెసర్ చరణ్‌కుమార్ శెట్టి తెలిపారు. శనివారం స్థానిక అశోక ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల జాతీయ స్థాయి రీసెర్చ్ కాన్ఫరెన్స్‌లో కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఇతర రాష్ట్రాల నుంచి ప్రొఫెసర్లు, వివిధ కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. చరణ్ కుమార్ శెట్టి మాట్లాడుతూ దేశం అభివృద్ధి చెందాలంటే ఇంజనీరింగ్ విద్యార్థులు నూతన ఆవిష్కరణలను ప్రవేశపెట్టి వాటిని ప్రజలకు ఉపయోగపడేలా చూడాలన్నారు. కళాశాల చైర్మన్ అశోకవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ అధ్యాపకులు, విద్యార్థులు పరిశోధనల జ్ఞానాలను పంచుకోవడం, నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహించడంలో ఇలాంటి సదస్సులు ఎంతోగానో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల సీఈవో డా.హరీష్ కృష్ణ, ప్రిన్సిపాల్ డా.నవీన్, అకడమిక్ ఎక్సలెన్సీ ఇనోవేషన్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యాపారుల అక్రమాలకు చెక్ పెడుతాం

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వ్యాపారుల అక్రమాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని, రైతులకు పంట ఉత్పత్తులపై గిట్టుబాటు ధర అందించేందుకు చర్యలు తీసుకుంటామని పాణ్యం మార్కెట్ కమిటీ అసిస్టెంట్ సెక్రటరీ రెహిమాన్ స్పష్టం చేశారు. శనివారం పాణ్యం మార్కెట్ కమిటీ సెక్రటరీగా రెహిమాన్ బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా చెక్‌పోస్టులను పటిష్టం చేసి ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిన సెస్సు ఆదాయాన్ని రాబడుతామని, ఇందుకు మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్లు, ఇతర సిబ్బంది సహకరించాలని ఆయన కోరారు.

ఘనంగా మాజీ సీఎం జగన్ జన్మదిన వేడుకలు



చిన్నారులకు కేక్ తినిపిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని

కల్లూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు నంద్యాల జిల్లా వైసీపీ అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం తన స్వగృహంలోని కార్యాలయంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, కార్పోరేటర్లతో కలిసి ఆయన కేక్‌కట్ చేశారు.

● అక్షయశ్రీ ఫౌండేషన్ హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో డాన్‌బాస్కో అనాథ ఆశ్రమంలో అనాథలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరై కేక్‌కట్ చేసి అన్నదానం చేశారు. నిర్వాహకులు నాగార్జున పాల్గొన్నారు.

● వైసీపీ అధినేత మాజీ సీఎం పుట్టినరోజు వేడుకలను కల్లూరు మండలం ఉలిందకొండలో ఘనంగా నిర్వహించారు. ఉలిందకొండ బాలికల హాస్టల్ విద్యార్థులకు గ్రైండర్, పుస్తకాలను పంపిణీ చేశారు. ఏవీ.రమణ, కాశీ, బి.రాజు, నగేష్ పాల్గొన్నారు.

కర్నూలు న్యూసిటీ: స్థానిక 40వ వార్డులో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 52వ జన్మదిన వేడుకలను స్థానిక కార్పొరేటర్ విక్రమసింహారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం వెంకటరమణ కాలనీ కేశవరెడ్డి పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, మేయర్ బీవై.రామయ్య, మాజీ కుడ చైర్మన్ కోట్ల హర్షవర్దన్‌రెడ్డి హజరై కేక్‌కట్ చేశారు. అనంతరం వార్డులోని పారిశుధ్య కార్మికులకు విక్రమసింహారెడ్డి సహకారంతో దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోడుమూరు ఇన్‌చార్జి ఆదిమూలపు సతీష్, డీసీసీబీ చైర్మన్ ఎస్వీ విజయమనోహరి, కార్పొరేటర్లు సాంబశివ, జుబేర్ అహ్మద్, యూనుస్ బాషా, సోంపల్లి క్రిష్ణకాంత్‌రెడ్డి,

● ఎస్‌బీఐ కూడలిలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి అధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ బీవై.రామయ్య, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలను వైసీపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. హుశేనాపురం, ఓర్వకల్లు, నన్నూరు, లొద్దిపల్లె, తదితర గ్రామాల్లో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు గడికెర వెంగన్న, నాగరాజులు, పాల మదుసూదన్, శరత్ కుమార్, చిన్న అయ్యన్న, యువరాజు, గుర్రాల చెన్నారెడ్డి, రంగనాథగౌడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎస్‌బీఐ కూడలిలో కేక్ కట్ చేస్తున్న వైసీపీ నాయకులు



హుశేనాపురంలో కేక్ కట్ చేస్తున్న వైసీపీ నాయకులు

రైతుల సమస్యలను పరిష్కరిస్తాం

తుగ్గలి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని తహసీల్దార్ రమాదేవి అన్నారు. శనివారం జి.ఎర్రగుడిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి అర్జీలు తీసుకున్నారు. డీటీ నాగరాజు, సర్వేయర్ సుధాకర్, వీఆర్వో రంగన్న ఉన్నారు.

షెడ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలి



మాట్లాడుతున్న డీపీవో భాస్కర్

ఆదోని రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): చెత్తనుంచి సంపద సృష్టి షెడ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని డీపీవో భాస్కర్ ఆదేశించారు. శనివారం కార్యాలయంలో డీఎల్‌పీవో నూర్జహాన్ అధ్యక్ష తన సమావేశం నిర్వహించారు. ఈవిషయమై పంచాయతీ కార్యద ర్శులను పర్యవేక్షించాలని కోరారు. ఇంటి పన్నుల వసూళ్లలో పురోగతి ఉండాలని సూచించారు. పారిశుధ్య పనులు చేపట్టి ప్రజలు రోగాల బారిన పడకుండా చూడాలని డీపీవో సూచించారు.

శ్రీనివాస రామానుజన్ జయంతి


ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గణిత శాస్త్ర మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి మున్సిపల్ పాఠశాలలో నిర్వహించారు. హెచ్‌ఎం మల్లికార్జున రామానుజన్ చిత్రపటాని నివాళి అర్పించారు. గణితం అంటే భయమొద్దని, ఇష్టంతో చదివితే సులువు అని సూచించారు. గణిత ఉపాధ్యాయులు నిరంజన్, మహేష్, జుబేర్, చంద్రశేఖర శర్మ, నాగజ్యోతి, జానకి, రమేష్ రావు పాల్గొన్నారు.

వసతి లేని గృహం



నియోజకవర్గంలో అధికంగా గిరిజన గ్రామాలు ఉండటంతో ప్రభుత్వం పత్తికొండలో 1998లో ఎస్టీ హాస్టల్‌ను ఏర్పాటు చేసింది. అయితే 2015లో ఈ వసతి గృహ విద్యార్థులను సమీకృత హాస్టల్లో విలీనం చేశారు. ఇక అప్పటి నుంచి అధికారులు ఈ భవనం వైపు కన్నెత్తి చూడటం లేదు. కొందరు విద్యార్థులు ఈ హాస్టల్‌లో వసతి పొంది, నేడు ఉన్నత స్థాయిలో ఉన్నారు. భవనాలు కూడా దెబ్బతిని, కిటికీలు, తలుపులు కూడా శిథిలావస్థకు చేరుకున్నాయి. గిరిజన సూపరింటెండెట్‌ను శ్రీమన్‌ను వివరణ కోరగా తాను కొత్తగా వచ్చానని పరిశీలిస్తానన్నారు. **- పత్తికొండ టౌన్.**

రహదారి మాదే



పట్టణంలోని పశువులు రోడ్డుపైనే తిష్ట వేశాయి. మున్సిపల్ మెయిన్‌రోడ్, ఎస్కేడీ కాలనీ, ఆర్ట్స్ కాలేజీ రోడ్డు నడి మధ్యలోనే ఇవి తిష్ట వేశాయి. వాటి యజమానులు పట్టించుకోకపోవటంతో రహదారులపై అడ్డంగా పడుకుని, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నాయి. రాత్రిళ్ల దాడులకు పాల్పడుతున్నట్లు వాహన దారులు వాపోతున్నారు. కూడ ఇలాగే ఉండటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మున్సి పల్ కమిషనర్ స్పందించి, వీటిని గోశాలకు తరలించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

- ఆదోని టౌన్

యేసుక్రీస్తుతో మానవులకు వెలుగు

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు21 (ఆంధ్రజ్యోతి): యేసుక్రీస్తు పుట్టుకతో మానవాళికి వెలుగు వచ్చిందని సీఎస్ఐ హోలి ట్రినిటీ చర్చి పాస్టర్ రెవరెండ్ ఇజ్రాయుల్ భరత్ బాబు అన్నారు. శనివారం పట్టణంలోని మిల్టన్ పాఠశాలలో క్రిస్మస్ వేడుకలు కరస్పాండెంట్ రమేష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. యేసుక్రీస్తు ప్రజలందరి రక్షణ కోసమే మానవ రూపంలో జన్మించారన్నారు. శాంటా క్లాస్ వేషధా రణలో సీఈవో వెంకటేష్ విద్యార్థులను అలరించారు. వైస్ ప్రిన్సిపాల్ రంగస్వామి, సుశీలా, లావన్య, జయసింహ అబ్రహం మరియమ్మ సునీత పాల్గొన్నారు.

క్రిస్మస్ సంబరాలు

ఆలూరు: పట్టణంలోని సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో శనివారం క్రిస్మస్ సంబరాలు నిర్వహించారు. యేసుక్రీస్తు జననం స్కిట్ ఆకట్టుకుంది..



నృత్యం చేస్తున్న చిన్నారులు

పీఎం శ్రీ ద్వారా క్రీడల అభివృద్ధి

ఆలూరు, డిసెంబరు21 (ఆంధ్రజ్యోతి): పీఎం శ్రీ పథకం కింద జిల్లాలోని 29 ప్రభుత్వ పాఠశాలల్లో రూ.1.5 కోట్లతో క్రీడల అభివృద్ధి చేస్తున్నట్లు సమగ్ర శిక్ష జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసులు తెలిపారు. శనివారం ఆలూరు మోడల్ స్కూల్‌లో బాడ్మింటన్ కోర్టును ఆయన పరిశీలించారు. మైదానంలోని పిచ్చి మొక్కలను తొలగించి బాలికల హాస్టల్ వద్ద డ్రైనేజీని బాగు చేయించాలని ప్రిన్సిపాల్ రాఘవరావు, కాంట్రాక్టర్‌కు సూచించారు. జేఈ విష్ణు, వైస్ ప్రిన్సిపాల్ వీరేష్, వార్డెన్ సుధారాణి, పీడీ ఈరన్న పాల్గొన్నారు.



బ్యాడ్మింటన్ కోర్టును పరిశీలిస్తున్న అధికారి

న్యాయాధికారిని నియమించాలి



వినతి పత్రం ఇస్తున్న న్యాయవాదులు

పత్తికొండ టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ జూనియర్ సివిల్ కోర్టుకు రెగ్యులర్ న్యాయాధికారినే నియమించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగస్వామి కోరారు. శనివారం కర్నూలులో రాష్ట్ర హైకోర్టు న్యాయాధికారి జస్టిస్ కే.మన్మథరావు, జిల్లా ప్రిన్సిపల్ న్యాయాధికారి కబర్దిలకు వినతి పత్రం సమర్పించారు. ఉపాధ్యక్షుడు రవికుమార్, సహాయ కార్యదర్శి వాసుదేవనాయుడు, ఏపీజీ నరసింహయ్య, బాలుబాషా, అశోక్‌కుమార్‌లు పాల్గొన్నారు.

ఆలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలి

ఆదోని టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): హిందూ ఆలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలని కల్లుమఠం పీఠాధిపతి సిద్ధ దేవరు వీహెచ్‌పీ ప్రాంత అధ్యక్షులు నందిరెడ్డి సాయి రెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్ సురేందర్ అన్నారు. శనివారం రాత్రి స్థానిక రెడ్డి కళ్యాణ మండపంలో వీహెచ్‌పీ అధ్యక్షుడు బసవన్న గౌడ్ అధ్యక్షతన హైందవ శంఖారావం నిర్వహించారు. ఆలయ ట్రస్టు బోర్డులలో రాజకీయ పార్టీల ప్రమేయం లేకుండా భక్తులు మాత్రమే ఉండేలా చూడాలన్నారు. విట్టా రమేష్, కునిగిరి నీలకంఠ, హనుమంత రెడ్డి కొంగే పంపాపతి, ప్రతాప్, రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీఠాధిపతి

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక

ఆలూరు, డిసెంబరు21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హత్తిబెలగల్ జడ్పీ పాఠశాల విద్యార్థులు రియాజ్, నజీర్ రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం శివప్రసాద్ శనివారం తెలిపారు. ఉపాధ్యాయులు బసవరాజు, కాసిం వలి, నరహరి, శంకరయ్య, వ్యాయామ ఉపాధ్యాయుడు చిన్నబాబు అభినందించారు.



విద్యార్థులతో ఉపాధ్యాయులు

ధ్యానంతో ప్రశాంతత

దేవనకొండ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ధ్యానంతో ప్రశాంతత లిస్తుందని నిర్వాహకులు శివప్రసాద్, శాంతికుమార్ అన్నారు. స్థానిక జూనియర్ కళాశాల, ఎఫ్‌ఆర్ పాఠశాలలో విద్యార్థులకు వివరించారు. అధ్యాపకులు వీరగురుడు, కృష్ణమూర్తి, బ్రహ్మేశ్వర్, రవిశంకర్, ఎఫ్‌ఆర్ పాఠశాల ఉచ్చీరప్ప, రఘునాథ్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సు

వెల్దుర్తి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్పరాజపురం గ్రామంలో తహసీల్దార్ చంద్రశేఖరవర్మ ఆధ్వర్యంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సర్వేయర్ హేమంత్‌రెడ్డి, విఆర్వో వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

రజకుల సంక్షేమానికి కృషి



కలెక్టర్‌తో చైర్‌పర్సన్ సావిత్రి

ఆదోని టౌన్, డిసెంబరు21 (ఆంధ్రజ్యోతి): రజకుల సంక్షేమానికి కృషి చేస్తానని రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి అన్నారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో పథకాలు అమలు కాలేదన్నారు. జీవో నంబర్ 27 ప్రకారం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ధోబి పోస్టులలో రజకులను మాత్రమే నియమించాలన్నారు. ఆసుపత్రులు పోలీసు అధికారుల యూనిఫారం, బెడ్‌షీట్లు శుభ్రం చేసే టెండర్లను రజకులకు మాత్రమే ఇవ్వాలన్నారు. జీవో నెంబరు 6 ప్రకారం జిల్లా స్థాయిలో రజక వెల్ఫేర్ కమిటీల ఏర్పాటు చేసి సాయం చేయాల్సి ఉందన్నారు. ఈవిషయమై కలెక్టర్‌తో మాట్లాడానని, ఆయన సానుకూలంగా స్పందించి, అధికారులను ఆదేశించడం సంతోషంగా ఉందన్నారు.

పోలీస్ ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్

● పాల్గొన్న ఎమ్మెల్యే శ్యాంబాబు



విన్నర్స్ పత్తికొండ సర్కిల్‌టీంతో ఎమ్మెల్యే

పత్తికొండ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని క్రీడామైదానంలో శనివారం నిర్వహించిన పోలీస్‌ఫ్రెండ్లీ క్రికెట్‌మ్యాచ్‌లో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు పాల్గొ న్నారు. పత్తికొండ సర్కిల్ వర్సెస్ వెల్దుర్తి సర్కిర్లు పోటీ పడగా పత్తికొండ సర్కిల్ విజయం సాధించిది. బ్యాటింగ్‌చేసిన వెల్దుర్తి టీం 15 ఓవర్లకు 101 పరుగులు చేసింది. అనంతరం పత్తికొండ సర్కిల్‌టీం నిర్దీత ఓవర్లు పూర్తికాకముందే లక్ష్యాన్ని ఛేదించి విజేతగా నిలిచింది. పత్తికొండ సర్కిల్ టీంలో ఎమ్మెల్యే బ్యాటింగ్, బౌలింగ్ చేశారు. కాగా పత్తికొండ సర్కిల్‌టీం కు రూరల్ సీఐ పులిశేఖర్, వెల్దుర్తి టీంకు సీఐ మధుసూదన్ కెప్టెన్‌గా వ్యవహరించారు.

నిధులు మంజూరు చేయాలి

మద్దికెర, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మదనంతపురం గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబుకు టీడీపీ నాయకులు మదనంతపురం ప్రసాద్, సంజప్ప, హనుమంతు వినతి పత్రం అందజేశారు. బసినేపల్లి పంచాయతీకి మజరా గ్రామమైన మదనంతపురం పార్టీకి కంచుకోట అని, గత వైసీపీ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. కాలువలు లేక డ్రైనేజీ అస్థవ్యస్థంగా ఉందని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. లింగమయ్య, లక్ష్మన్న ఉన్నారు.

చెరువుల అభివృద్ధికి కృషి చేయాలి

తుగ్గలి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): చెరువుల అభివృద్ధికి కృషి చేసి రైతులకు సాగునీరు అందించాలని నీటి సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, దేవదాసు గౌడ్ కోరారు. శనివారం పత్తికొండలో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబును సన్మానించారు. స్పందించిన ఎమ్మెల్యే రైతుల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

‘డబ్బులు అడిగితే ఫిర్యాదు చేయండి’

ఆలూరు, డిసెంబరు21 (ఆంధ్రజ్యోతి) : ఇళ్ల మంజూరుకు డబ్బులు అడిగితే తనకు తెలియజేయాలనితాను కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని ఎమ్మెల్యే విరుపాక్షి తెలిపారు. శనివారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో అధికారులు, దళారులు డబ్బులు డిమాండ్ చేస్తే సహించలేదన్నారు. సీఎం చంద్రబాబు అమలు చేయలేని హామీలు ఇచ్చి ప్రజలను దగా చేశారన్నారు. రైతు భరోసా, అమ్మ ఒడి ఇస్తామన్నా హామీలు 5నెలలు గడిచినా అమలుకు నోచుకోవడం లేదని ప్రజలు గమనిస్తున్నారన్నారు.

ఇది రైతు ప్రభుత్వం

మద్దికెర, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తమది రైతుల ప్రభుత్వమని, రీసర్వేతో ఇబ్బంది పడ్డ రైతుల సమస్యలను సీఎం చంద్రబాబు పరిష్కరిస్తున్నారని సర్పంచ్ బొమ్మనపల్లి ఆంజనేయులు, ఎంపీటీసీ కొత్తపల్లి రంగస్వామి, తహసీల్దార్ హుశేన్‌సాహెబ్ అన్నారు. శనివారం హంపా గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. క్రయ విక్రయాలు ఆగిపోయిన భూముల సమస్యలను 45 రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. వీఆర్వో రంగస్వామి, స్వర్ణమ్మ, రైతులు ఫకృద్దీన్ తదితరులు ఉన్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

వెల్దుర్తి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): వెల్దుర్తిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుచేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ కార్యాలయంలో మాట్లాడుతూ ఇంటర్ పూర్తి చేశాక, డిగ్రీ చదవాలంటే సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంద న్నారు. సుధీర్‌నాయుడు, సురేంద్ర, సహనంద్, సుదర్శన్ పాల్గొన్నారు.

రూ.40 లక్షలతో అభివృద్ధి

తుగ్గలి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రూ.40లక్షలతో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు, పంచాయతీ సలహాదారుడు వెంకటపతి అన్నారు. శనివారం ఎమ్మెల్యే శ్యాం బాబు సహకారంతో చెన్నంపల్లి, రామలింగాయపల్లి, కేపీ గుడిసెల్లో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్లు మురుగు కాలువలను నిర్మించామన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తాం

మద్దికెర, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తామని, ఎస్ఈ ఉమాపతి అన్నారు. శనివారం స్థానిక సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేసి, బస్టాండు వద్ద విద్యుత్ లైన్లను పరిశీలించారు. తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను గుర్తించి సరి చేస్తున్నామన్నారు. బస్టాండు వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చాలంటే పంచాయతీ మొత్తాన్ని చెల్లించా లన్నారు. సోలార్ విద్యుత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మాజీ ఎంపీపీ మల్లికార్జున యాదవ్, సలహా దారులు బండారు ఆంజనేయులు, మాజీ ఉప సర్పంచ్ వి.నాగేశ్వరరెడ్డి, సర్పంచు బురుజుల విజయుడు, మాజీ కోఆప్షన్ సభ్యులు సత్తార్, ఈఈఆర్‌డీ మద్దిలేటి స్వామి, విద్యుత్ ఏఈ మహ్మద్‌రఫీ ఉన్నారు.



విద్యుత్ లైన్లను పరిశీలిస్తున్నఎస్ఈ

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

● కొనసాగుతున్న నిరసనలు
● పత్తికొండలో దిష్టిబొమ్మ దహనం



పత్తికొండలో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

పత్తికొండ టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, వ్యవసాయ సంఘం ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి వైఖరిని నిరసి స్తూ శనివారం పత్తికొండలో దిష్టిబొమ్మను దహనం చేశారు. మోదీ వచ్చాక మత ప్రాదిక పైనే పరిపాలన చస్తున్నారని పార్లమెంట్ సాక్షిగా అంబేడ్కర్‌ను అవమానించేలా వ్యాఖ్య లు చేయడం సరికాదన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు నబీ రసూల్, మండల కార్యదర్శి రాజాసాహెబ్, పట్టణ కార్యదర్శి రామాం జనేయులు, ప్రజా సంఘాల నాయకులు కారన్న, కృష్ణ, తిమ్మ య్య, ఎంకే సుంకన్న, సిద్ద లింగప్ప, సుల్తాన్, నెట్టికంటయ్య, హనుమేష్, పాల్గొన్నారు.

అమీత్‌షాను పదవి నుంచి తొలగించాలి

ఆదోని రూరల్: పార్లమెంట్ సాక్షిగా డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ పట్ల అవమానంగా మాట్లాడిన అమీత్‌షాను కేంద్ర మంత్రి పదవి నుంచి తొలగించాలని మాల మహానాడు నాయకులు డిమాండ్ చేశారు. శనివారం అమీత్‌షాకు వ్యతిరేకంగా మాలమహానాడు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. నిండు సభలో అంబేద్కర్‌ను హేళన చేస్తూ, అమీత్ షా మాట్లాడడం దారుణమని, వెంటనే దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శ్రీనివాసులు, బొబ్బిలి, జూనైద్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

జగన్ జన్మదిన వేడుకలు

ఆలూరు, డిసెంబరు21 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు ఎమ్మెల్యే బి విరుపాక్షి ఆధ్వర్యంలో చేసుకునానరు. పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించి, ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో కేక్‌కట్ చేశారు. జగన్ సంక్షేమ పథకాల అమలులో చరిత్ర సృష్టించారన్నారు. వైసీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కురువ శశికళ కృష్ణమోహన్, జడ్పీటీసీ కిట్టు, సీనియర్ నాయకులు మారయ్య, జనార్దన్ నాయుడు, శ్రీనివాసులు, యువనేత చంద్ర శేఖర్, మొలగవల్లి రామాంజినేయులు, చిన్న ఈరన్న, విక్రాంత్ రెడ్డి, అరికెర వెంకటేష్, వీరేష్, జట్టప్పా గారి వీరేష్, రాజశేఖర్, వరుణ్, కొట్టాల రాజు పాల్గొన్నారు.

వాగ్దానాలను విస్మరించిన ప్రభుత్వం

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు21 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను కూటమి ప్రభుత్వం విస్మరించిందని మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి ఆరోపించారు. శనివారం మాజీ సీఎం జగన్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్సీ మధుసూదన్, చంద్రకాంత్ రెడ్డి, దేవా, కౌన్సిలరులు నరసింహులు, చలపతి ఫయాజ్, అశోక్ పాల్గొన్నారు.

పత్తికొండ టౌన్: పట్టణంలో శనివారం మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు పార్టీ నాయకులు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కే.శ్రీదేవి స్వగృహంలో కేక్ కట్ చేశారు. మాజీ సర్పంచ్ సోమశేఖర్, ఎంపీపీ నారాయణదాసు, కన్వీనర్ నాగరాజు, సర్పంచులు రెహిమాన్, కేశవరెడ్డి, గాంధీరెడ్డి, శ్రీరాములు, తిప్పయ్య, ఎంపీటీసీలు కేశప్ప, గణపతి, ఎస్టీ సెల్ జిల్లా నాయకులు భాస్కర్ నాయక్, శ్రీను జయచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ...

వెల్దుర్తి టౌన్: పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి ఆధ్వర్యంలో మాజీ సీఎం వైఎస్ జగన్ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశయాలను సాధిద్దామని పిలుపు నిచ్చారు. కన్వీనర్ రవిరెడ్డి, జడ్పీటీసీ సుంకన్న, ఎంపీపీ రంగయ్య, సర్పంచ్ శైలజ, వెంకటేశ్వరరెడ్డి, నాగిరెడ్డి, దేవరాజు పాల్గొన్నారు.



ఆదోనిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్



వెల్దుర్తిలో పండ్లు, బ్రెడ్లు ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి

హోమియో మందులతో ఆరోగ్యం పదిలం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

● వైద్యురాలు గౌసియాబాను



పత్తికొండ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): హోమియో మందులతో ఆరోగ్యం పదిలమని పత్తికొండ హోమియో వైద్యురాలు గౌసియాబాను అన్నారు. ఆమె ఆంధ్రజ్యోతికి ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: రోగులకు ఏవిధమైన చికిత్స ఇస్తున్నారు?

జవాబు: హోమియో ద్వారా బీపీ. షుగర్, థైరాయిడ్‌లతోపాటు అన్నిరకాల వైద్యసేవలు అందిస్తాం.

ప్రశ్న: గతంలో ఉన్న హోమియోపతి ఆసుపత్రికి నేటి ఆయుష్ ఆసుపత్రికి తేడా ఉందా?

జవాబు: గతంలో జబ్బులకు హోమియో మందులు మాత్రమే ఇచ్చేవారం. ఆయుష్ ద్వారా మందులతోపాటు, యోగాను కూడా నేర్పుతున్నాం. ఇందుకు ప్రభుత్వం ఇద్దరు యోగా ట్రైనర్స్‌ను నియమించింది.

ప్రశ్న: ఆహార నియమాలు పాటించాలా?

జవాబు: ప్రత్యేక ఆహార నియమాలంటూ ఏమిలేవు. మందులను బట్టి రోగులకు కొన్ని సూచనలు ఇస్తాం.

ప్రశ్న: ఓపీ ఎలా ఉంది ?

జవాబు: ప్రస్తుతం రోజుకు 30 నుంచి 40 మంది రోగులు వస్తున్నారు.

ప్రశ్న: హోమియో మందులతో ఉపయోగం ఉందా ?

జవాబు: చాలామంది రోగులకు హోమియో మందుల ఉపయోగం తెలియదు. అలాగే ఇంగ్లీష్ మందులపై నమ్మకం ఉంది. ప్రైవేటు ఆసుపత్రుల్లో రూ.వేలు ఖర్చు చేసేబదులు హోమియో మందులతో వ్యాధులు నయం చేసుకోవచ్చు.

తహసీల్దారుకు పదోన్నతి

కోసిగి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కోసిగి తహసీల్దార్ ఏ.నిత్యానంద రాజుకు డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి వచ్చింది. ప్రభుత్వం ఆయన్ను కడప జిల్లా ఎడ్యుకేషన్ డిపార్టమెంట్ సమగ్ర శిక్ష ఏపీసీగా నియమించింది. ఐదు నెలల క్రితం కోసిగి తహసీల్దార్‌గా ఏ. నిత్యానందరాజు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ రుద్రగౌడు, ఆర్ఐ శ్రీరాములు, సీనియర్ అసిస్టెంట్ తిక్కస్వామి, సర్వేయర్, వీఆర్వోలు శుభాకాంక్షలు తెలిపారు.

జాతీయస్థాయి రగ్బీ పోటీలకు విద్యార్థి ఎంపిక


సుమన్

కోసిగి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిన్నభోంపల్లి గ్రామానికి చెందిన గుమ్మల బాలరాజు, హుశేనమ్మ దంపతుల కుమారుడు జి.సుమన్ జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికయ్యాడు. క్రీడాకారుడు జి.సుమన్ సి. బెళగల్‌లోని రెసిడెన్షియల్ గురుకుల కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. రాష్ట్ర స్థాయిలో వెస్ట్‌గోదావరి ఏలూరులో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. ఈ నెల 24, 25 తేదీల్లో బీహార్‌లో జరిగే జాతీయ రగ్బీ పోటీల్లో ఆడుతున్నట్లు క్రీడాకారుడు సుమన్ తెలిపారు. ఈ సందర్భంగా సుమన్‌ను గ్రామస్థులు అభినందించారు.

అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు


మౌంట్ కార్మెల్ పాఠశాలలో ప్రిన్సిపాల్‌ను విచారిస్తున్న ఎంఈవో

కోసిగి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు తప్పవని ఇన్‌చార్జి ఎంఈవో శోభారాణి హెచ్చరించారు. వివిధ కార్యక్రమాల పేరుతో విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో శనివారం మండల కేంద్రంలోని మౌంట్ కార్మెల్ హైస్కూల్‌లో ఆమె విచారణ చేపట్టారు. విద్యార్థుల నుంచి బలవంతంగా వార్షికోత్సవానికి డబ్బులు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని, విద్యార్థులను ఫీజు కట్టలేదని ఇబ్బందులకు గురి చేయడం నేరమన్నారు. ఇలాంటి ఘటనలు మరలా పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎంఈవోకు వినతి పత్రం అందజేశారు.

జీవో నెం 77ను రద్దు చేయాలి



సీనియర్ అసిస్టెంట్ తిక్కస్వామికి వినతి పత్రం ఇస్తున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వీరేష్

కోసిగి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జీవో.నెం.77ను రద్దు చేయాలని, పీజీ విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ వర్తింపజేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వీరేష్ డిమాండ్ చేశారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ తిక్కస్వామికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేశ్ జీవో.నెం.77ను రద్దు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను, వసతి దీవెన డబ్బులు ప్రభుత్వం విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు దివాకర్, కిషోర్, లక్ష్మన్న, రామకృష్ణ ఉన్నారు.

సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి

కౌతాళం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్డు పనుల్లో నాణ్యతను పాటించాలని ఎంపీడీవో సుబ్బరాజు అన్నారు. కౌతాళంలోని శివప్ప నగర్‌లో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను శనివారం పంచాయతీ రాజ్ ఏఈ శ్రీనివాసరెడ్డితో కలిసి ఎంపీడీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పల్లెపండుగ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టిందన్నారు. ఇందులో భాగంగా శివప్ప నగర్‌లో రూ. 15లక్షలతో సీసీ రోడ్డు వేయిస్తున్నట్లు తెలిపారు. పనుల్లో నాణ్యత పాటించేలా చూడాలని పీఆర్ ఏఈ శ్రీనివాసరెడ్డిని సూచించారు. అనంతరం రాజానగర్ క్యాంపులో నిర్మిస్తున్న గోకుల షెడ్‌లను పరిశీలించారు.

కళాశాలపై చర్యలు తీసుకోవాలి


డిప్యూటీ తహసీల్దార్ వీరేంద్రగౌడుకు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): అధిక ఫీజులు వసూలు చేస్తున్న సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఆయా విద్యార్థి సంఘాల నాయకులు వీరేష్‌యాదవ్, శేఖర్, అఫ్రిద్, రఘు, కృష్ణ డిమాండ్ చేశారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ వీరేంద్రగౌడుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉసేని తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలో రికార్డుల పరిశీలన

నందవరం, డిసెంబరు21 (ఆంధజ్యోతి): మండలంలోని ముగతి గ్రామంలో శనివారం ఈవోపీఆర్డీ సందీప్ రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రికార్డులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ ఉండాలని సూచించారు. సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. అటెండెన్సులో సంతకాలు చేసి ఫీల్డ్‌కు వెళ్లాలన్నారు. అలాగే నందవరంలో గ్రామానికి తాగునీరు అందజేసే తిమ్మరాజు కుంటను పరిశీలించారు. కుంటలో బ్లీజింగ్ పౌడర్‌ను క్లోరినేషన్ చేసి ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందజేయాలని సిబ్బందికి సూచించారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన నరవ దంపతులు


టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను కలిసిన నరవ దంపతులు

పెద్దకడుబూరు , డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మంగళగిరి పార్టీ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను శనివారం టీడీపీ రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి, హనుమాపురం ఎంపీటీసీ సభ్యురాలు నరవ శశిరేఖ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలోని నెలకొన్న సమస్యలు, కురువ కమ్యూనిటీహాల్, తాగునీటి, భూ సమస్యలను, అలాగే హనుమాపురంలో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారినికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సాధికారత మెంబర్ మల్లికార్జున, ఎస్సీ సెల్ కార్యదర్శి బొగ్గుల నరసన్న పాల్గొన్నారు.


మాధవరం స్టీల్ ఫ్యాక్టరీ వద్ద గుంతలు పడిన రోడ్డు


సూగూరు గ్రామం వద్ద కోతకు గురైన రోడ్డు

అధ్వానంగా రహదారులు

మంత్రాలయం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని మాధవరం నుంచి సూగూరుకు వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది. గత వర్షాలకు మాధవరం వాగు సూగూరు సమీపంలో కాల్వ పక్కన కోతకు గురైన రోడ్లను పట్టించుకునేవారే కరువయ్యారు. ఈ రోడ్లను సూగూరు, బూదూరు, కల్లుదేవకుంట, చిలకలడోన, వగరూరు, తిమ్మాపురం, కంబలదిన్నె, జాలవాడి గ్రామాలకు ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. మాధవరం నుంచి స్టీల్ ఫ్యాక్టరీ వరకు సీసీ రోడ్డు నిర్మించారు. అక్కడి నుంచి సూగూరు క్రాస్ వరకు పెద్ద పెద్ద గుంతలు, కోతకు గురైన రోడ్లతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కోతకు గురైన ప్రాంతాల్లో ప్రయాణాల్లో ఆదమరిస్తే అంతే సంగతులే. ఆర్అండ్‌బీ అధికారులు ఇటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. ఈ గ్రామాలకు వెళ్లే రహదారులను పట్టించుకుని మరమ్మతులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అమిత్ షాను మంత్రి పదవి నుంచి తొలగించాలి

కౌతాళం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను కేంద్ర మంత్రిత్వ శాఖ నుంచి వెంటనే తొలగించాలని సీపీఎం సీనియర్ నాయకుడు మల్లయ్య, జైభీం వ్యవస్థాపకుడు అవతారం డిమాండ్ చేశారు. శనివారం కౌతాళంలో ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసగా అంబేడ్కర్ సర్కిల్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం వల్ల నేడు భారతీయ పౌరులు దేశంలో స్వేచ్ఛగా జీవిస్తున్నారని, అలాంటి మహనీయుడిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. అమిత్‌షా చేసినటువంటి ఆరోపణలు వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) నాయకుడు జగదీష్, వీరేష్, అవాజ్ కమిటీ నాయకులు ఖాజా హుసేన్, ఇద్రూష్ బాష, విశాక్ సాహెబ్, సర్పంచ్ పాల్‌దినకరన్, జనసేనా నాయకులు రామాంజనేయులు ఉన్నారు.

గోనెగండ్ల: అబేండ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు రంగన్న, సీనియర్ నాయకుడు మద్దిలేటినాయుడు, రైతు సంఘం నాయకుడు మాలిక్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రమైన గోనెగండ్లలోని కర్నూలు బళ్లారి ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ బీజేపీ కుల, మత, వర్గ, భాషా పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెడుతోందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను పూర్తిగా ప్రైవేట్ పరం చేస్తూ అదానీ, అంబానీలకు దోచిపెడుతున్నారని ఆరోపించారు. అమిత్ షా భారత జాతికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రంగస్వామి, యూనుస్, శ్రీరాములు, నరసింహులు, నాగరాజు, నబి, రాముడు, నరసన్న, లక్ష్మన్న, దస్తగిరి, వెంకటేష్, మల్లేష్, పాల్గొన్నారు.



గోనెగండ్లలో రహదారిపై రాస్తారోకో నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

అంగరంగ వైభవంగా స్వర్ణ రథోత్సవం

మంత్రాలయం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు స్వర్ణ రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. శనివారం ధనుర్మాసం షష్టి శుభ దినాన్ని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బంగారు,వెండి, పట్టువస్త్రాలు, బెంగళూరు నుంచి తెచ్చిన ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్చరణాలు, మంగళ వాయిద్యాల మధ్య స్వర్ణ రథంపై వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలను అధిష్ఠించి, పీఠాధిపతి మహా మంగళహారతులు ఇచ్చి రథంపై నుంచి భక్తులకు ఆశీస్సులు అందజేశారు. అంతకు ముందు పీఠాధిపతి మూలరాములు, జయరాములు, దిగ్విజయ రాములకు స్వర్ణ నాణేలతో అభిషేకం చేసి మహా మంగళ హారతులు ఇచ్చి భక్తులను పీఠాధిపతి ఆశీర్వదించారు.

రాఘవేంద్రున్ని సన్నిధిలో రామప్రియతీర్థులు

రాఘవేంద్రస్వామి దర్శనార్థం బాలాహర్ అక్షోభ్య మఠం పీఠాధిపతి రామప్రియతీర్థులు శనివారం రాత్రి మంత్రాలయం వచ్చారు. పీఠాధిపతికి మఠం అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్రస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మంత్రాలయం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులతో కలిసి మఠాల అభివృద్ధిపై చర్చించారు. రథోత్సవాల ఊరేగింపులో పాల్గొన్నారు. ఇరువురు పీఠాధిపతులు శాలువు, పూలమాలలతో ఘనంగా సత్కరించుకున్నారు. కార్యక్రమంలో మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేశ్ జోషి, శ్రీపతాచార్, ఐపీ నరసింహమూర్తి, జయతీర్థాచార్, నరసింహ దేశాయ్, అనంతపురాణిక్, ద్వారపాలక అనంతస్వామి తదితరులు పాల్గొన్నారు.


స్వర్ణ రథాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

మఠం గోశాలకు రూ.లక్ష విరాళం

రాఘవేంద్రస్వామి మఠానికి మైసూరుకు చెందిన దేవపాల్ అనే భక్తుడు రూ.లక్ష విరాళం ఇచ్చినట్లు ఏఏవో మాధవశెట్టి, మేనేజరు వెంకటేష్ జోషి తెలిపారు. శనివారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్న ఆయన గోశాలకు నగదును విరాళం ఇచ్చినట్లు తెలిపారు. దాత కుటుంబానికి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

రక్తదాన శిబిరం

ఎమ్మిగనూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని వైసీపీ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక వైఎస్ఆర్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేక్‌ను ఎర్రకోట జగన్మోహన్‌రెడ్డి, వైసీపీ నాయకులు బుట్టా నీలకంఠ కట్‌చేశారు. అలాగే రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. పలువురు యువకులు రక్తదానం చేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పాలు,బ్రెడ్లు, పండ్లు, అందజేశారు. బుట్టా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 200 కుర్చీలు, బెడ్‌షీట్లను ఆసుపత్రికి విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రఘు, వీరశైవలింగాయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై రుద్రగౌడ్, ఎంపీపీ కేశన్న, నాయకులు సోగనూరు భీమిరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, మాజీ ఎంపీపీ కృష్ణారెడ్డి, విరుపాక్షిరెడ్డి, యుకే రాజు,మాచాని వెంకటేశులు, సునీల్ కుమార్, అల్తాఫ్, చాంద్, కాశిరెడ్డి పాల్గొన్నారు.


పట్టణంలోని వైఎస్ఆర్ సర్కిల్‌లో రక్తదానం చేస్తున్న యువకులు, పాల్గొన్న నాయకులు

నందవరం: మండలంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముగతి గ్రామంలో మంత్రాలయం సర్కిల్ దగ్గర వైసీపీ మండల కన్వీనర్ శివారెడ్డిగౌడ్, ముగతి సర్పంచ్ విరుపాక్షిరెడ్డి, కనకవీడు లక్ష్మీకాంతరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సోమలగూడురు వెంకటేశ్వరరెడ్డి, చాంద్, సుధాకర్, నర్సరాజు, వందలాది కార్యకర్తలు పాల్గొన్నారు.


ముగతిలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

బదిలీల్లో ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్దన్

ఎమ్మిగనూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది వేసవి సెలవుల్లో ప్రభుత్వం నిర్వహించే బదిలీల్లో ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలని ఎస్టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి టీకే జనార్దన్, రాష్ట్ర నాయకులు తిమ్మన్న, వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం పట్టణంలోని ఎస్టీయూ కార్యాయలంలో సంఘం ముఖ్యనాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీకే జనార్దన్ మాట్లాడుతూ 2025 వేసవి సెలవులలో ప్రభుత్వం నిర్వహించే బదిలీలకు మే 31ని కటాఫ్ తేదీగా తీసుకోవటం వల్ల 2023జూన్‌లో బదిలీలలు, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులు, 2017లో బదిలీలు పొందిన ఉపాధ్యాయులకు ప్రస్తుత బదిలీల్లో పాల్గొనే అవకాశం ఉండదని, దీని వల్ల సీనియర్ ఉపాధ్యాయులు నష్టపోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. 2023లో నిర్వహించిన అస్తవ్యస్త బదిలీలు, పదోన్నతుల వల్ల సర్వీస్‌లో సీనియర్లు అయినా సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చిందన్నారు. ఉపాధ్యాయులు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న బదిలీల చట్టం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చొరవచూపటం హర్షణీయమన్నారు. సమావేశంలో నాయకులు బసవరాజు, నాగరాజు, రామచంద్ర, సురేష్, శేఖర్, చంద్రశేఖర్, వెంకట్రాముడు, శీలప్ప పాల్గొన్నారు.

రికార్డులు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు

ఎమ్మిగనూరు రూరల్ , డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): వాహనదారులు రికార్డులు లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. శనివారం మండల పరిధిలోని గుడికల్లు రోడ్డులో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా వాహనదారులను నిలిపి రికార్డులను తనిఖీ చేశారు. అలాగే మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. రోడ్డు భద్రతానియమాలను వాహనదారులు తప్పకుండా పాటించాలన్నారు. తనిఖీల్లో హెడ్‌కానిస్టేబుల్ చంద్రశేఖర్, కానిస్టేబుళ్లు రమేష్, రెడ్డి పాల్గొన్నారు.

మిరప పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం నాయకులు

కోసిగి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మిరప పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్ యాదవ్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడు అన్నారు. శనివారం మండల పరిధిలోని కోల్‌మాన్‌పేట గ్రామంలో రైతు సంఘం మంత్రాలయం తాలుకా అధ్యక్షుడు గోపాల్ అధ్యక్షతన రైతు సంఘం ఆధ్వర్యంలో జీపుజాతా బృందం మిర్చి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిర్చి రైతులు ఎకరాకు రూ.లక్ష మేర పెట్టుబడి పెట్టినా గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోయారన్నారు. ఈ నెల 23న పెద్దకడబూరు మండల కేంద్రంలో మిరప రైతులను ఆదుకోవాలని, పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా రైతు సదస్సు ఏర్పాటు చేశామన్నారు. ఈ సదస్సును మండలంలోని మిర్చి రైతులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మబ్బు ఆంజనేయ, లక్ష్మణ్ నాయక్, ఓంకార్ స్వామి, చంద్ర, తాయన్న పాల్గొన్నారు.

భాష్యంలో గణిత దినోత్సవం


చిన్నారులు చార్టుల్లో చిన్నారులు రూపొందించిన లెక్కల చిత్రాలను ప్రదర్శిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భాష్యం పాఠశాలలో శనివారం ముందస్తు గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కవిత ఆధ్వర్యంలో విద్యార్థులకు గణితానికి సంబంధించిన కాలిబర్ టెస్టులు, రామానుజన్ క్విజ్ కాంపిటీషన్, మాథ్స్ ఏకో, గణితానికి సంబంధించిన రంగవల్లులు వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గణితంపై పరిశోధనలు చేసి కొత్త సిద్ధాంతాలను కనిపెట్టిన రామానుజన్ జయంతిని డిసెంబరు 22న జరుపుకొని గణిత మేధావిని స్మరించుకోవటం మనందరి బాధ్యతన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది అనురాధ, నాగరాజు, మార్కండేయ, ఈశ్వర్, హనీఫ్, స్వాతి, మహబూబ్ పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారమే ధ్యేయం

పెద్దకడుబూరు , డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): పెద్దకడుబూరు మండంలోని ముచ్చిగిరి గ్రామంలోని రైతుల భూ సమస్యల పరిష్కారమే ధ్యేయమని తహసీల్దార్ శ్రీనాథ్ తెలిపారు. శనివారం మండలంలోని ముచ్చగిరి గ్రామంలో రెవెన్యూ గ్రామ సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వేలో జరిగిన తప్పిదాలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ జర్మియా, వీఆర్వో ఆదెప్ప, సర్వేయర్ రామాంజినేయులు పాల్గొన్నారు.

కౌతాళం: గ్రామ రెవెన్యూ సదస్సుల్లో భూసమస్యలు పరిష్కరించుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ రజినీకాంత్ రెడ్డి సూచించారు. శనివారం కౌతాళం పంచాయతీ కార్యాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ సదస్సులు వచ్చే నెల 8వరకు నిర్వహిస్తామన్నారు. మండలంలోని రైతన్నలు ఈ సభలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏమైనా సమస్యలుంటే ఈ సభల ద్వారా తమ దృష్టికి తీసుకువస్తే విచారించి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. అనంతరం రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. సమావేశంలో గ్రామ సర్పంచ్ పాల్ దినకరన్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప, మండల సర్వేయర్ బసవరాజు స్వామి, వీఆర్వోలు నాగేంద్రప్ప, మహదేవప్ప, నరసింహులు కూటమి ప్రభుత్వ నాయకులు రామాంజనేయులు, రైతులు ఉన్నారు.

గోనెగండ్ల: రీ సర్వేలలో జరిగి పొరపాట్లను సరిచేసేందుకు రెవెన్యూ సదస్సులను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తహసీల్దార్ కుమారస్వామి అన్నారు. శనివారం మండల మండల పరిధిలోని కుర్నూరులో గ్రామ సభ నిర్వహించారు. సభకు రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ శిరీషా, జనార్దన్ రావు, ఆర్ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

మంత్రాలయం: రైతులకు రెవెన్యూ సదస్సులు వరంలాంటివని డిప్యూటీ తహసీల్దార్ జీకే గురురాజరావు అన్నారు. శనివారం మండలంలోని ఖగ్గల్లు గ్రామంలో సర్పంచ్, వీఆర్వో పుష్పావతి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ రీసర్వే జరిగిన పొరపాట్లను సరి చేసుకోవాలని సూచించారు. రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో సర్వేయర్ భరణి, నాగభూషణం రావు, రైతులు పాల్గొన్నారు.


కౌతాళంలో అర్జీలను స్వీకరిస్తున్న ఇన్‌చార్జి తహసీల్దార్

నందవరం: మండల పరిధిలోని పూలచింతలో శనివారం సర్పంచ్ బండే గురుస్వామి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామంలో రైతుల భూసమస్యలను పరిష్కరిస్తామన్నారు. రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. అలాగే గ్రామంలో భూ తగదాలు ఉన్న భూములను విచారించారు. డీటీ మహేష్, వీఆర్వో రఘు, సర్వేయర్ ముగతి శేఖర్ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: మండల పరిధిలోని రాళ్లదొడ్డి గ్రామంలో రెవెన్యూ సదస్సును తహసీల్దార్ శేషఫణి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. గ్రామంలో 15 మంది రైతులు తమ సమస్యలను అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో సర్వేయర్ వాహిద్, వీఆర్వో రంగారెడ్డి, రైతులు పాల్గొన్నారు.



గోనెగండ్లలో ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరిస్తున్న తహసీల్దార్ కుమారస్వామి



పూలచింతలో రెవెన్యూ సదస్సులో పాల్గొన్న అధికారులు


మంత్రాలయంలో మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్